పత్తి కొనుగోలు తాత్కాలికంగా నిలిపివేత

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని జిన్నింగ్ మిల్లులలో పత్తి, పత్తి గింజల నిల్వలు ఎక్కువ అయినందున పత్తి కొనుగోలు ప్రక్రియను తాత్కాలికంగా నిలిపివేస్తున్నామని జిల్లా మార్కెటింగ్ అధికారి అశ్వక్ అహ్మద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, సిర్పూర్, కౌటాల, జైనూర్‌లలో గల జిన్నింగ్ మిల్లులలో నేటి నుండి ఈ నెల 5 వరకు ఐదు రోజులపాటు పత్తి కొనుగోలు ప్రక్రియ నిలిపివేస్తున్నామని తెలిపారు. తర్వాత యధావిధిగా కొనుగోలు జరుగుతుందని, రైతుల వద్ద పత్తి పంట పూర్తయ్యే వరకు కొనుగోలు చేయడం జరుగుతుందని, ఈ ఐదు రోజులు ఎవరు కూడా సిసిఐ కాకుండా దళారులకు అమ్మి నష్టపోకూడదని పేర్కొన్నారు. ఈ విషయాన్ని గమనించి సహకరించాలని తెలిపారు.

ఎస్పీకి ఫొటో బహూకరించిన క్రిష్ణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ జిల్లా అంటేనే అడవులకు నెలవు. జిల్లా అందాలు చూడాలంటే రెండు కళ్లు చాలవు. జిల్లాలోని తలమడుగు మండలం కోసాయి ఆదివాసీ గూడెం దట్టమైన అడవుల్లో దాగి ఉన్న చిత్రాన్ని జిల్లాకు చెందిన వైల్డ్ లైఫ్ ఫొటోగ్రాఫర్ లింగంపల్లి కృష్ణ మంగళవారం ఎస్పీ గౌస్ ఆలంకు నూతన సంవత్సర కానుకగా అందజేశారు. ఫొటోను చూసిన ఎస్పీ ఈ ప్రదేశం గురించి అడిగి తెలుసుకొని, చాలా బాగా తీశావని కృష్ణను అభినందించారు. ఈ సందర్భంగా ఫొటోగ్రాఫర్ జిల్లాలోని ప్రకృతి రమణీయత, అందాలను కొద్దిసేపు ఎస్పీతో ముచ్చటించారు.



నేరాలు తగ్గినా.. పెరిగిన లైంగిక దాడులు..!

- ఆందోళనకు గురిచేస్తున్న సైబర్ క్రైం కేసులు
- ఏటా నమోదవుతున్న గంజాయి, డ్రగ్స్ కేసులు
- పెరుగుతున్న ఆర్థిక నేరాలు, చీటింగ్ కేసులు
- ఉమ్మడి జిల్లాలో వార్షిక క్రైం నివేదికలో వెల్లడి

ప్రభుత్వం నేరాల అదుపునకు ఎన్ని చట్టాలు తెచ్చినా.. నేరస్థులకు కోర్టుల్లో శిక్షలు పడుతున్నా నేరాలు మాత్రం ఆగడం లేదు. రోజూ ఎక్కడో ఓ చోట నేరం కేసులు నమోదవుతూనే ఉన్నాయి. ఆదిలాబాద్ జిల్లాలో 2023లో నమోదైన వివిధ కేసుల కంటే ఈ ఏడాది స్వల్పంగా తగ్గుముఖం పట్టినా..లైంగికదాడి ఘటనలు అధికంగా నమోదు కావడం ఆందోళనకరంగా మారుతోంది. మహిళల భద్రత కోసం ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు తీసుకొస్తున్నా.. వారిపై వేధింపులు మాత్రం ఆగడం లేదు. మరోపక్క గంజాయి, డ్రగ్స్‌ను పూర్తిగా నివారించాలని ప్రభుత్వాలు, పోలీసులు ఎంతగా ప్రయత్నించినా.. ఎక్కడో చోట నిందితులు పట్టుబడుతుండటం.. కేసులు నమోదవుతుండటం పరిపాటిగా మారుతోంది. మరోపక్క ఘోర రోడ్డు ప్రమాదాలు సైతం చోటు చేసుకోవడం పలు కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపుతోంది. ముఖ్యంగా జాతీయ రహదారిపై జరుగుతున్న ప్రమాదాల్లో ఎక్కువ మంది మృత్యువాత పడుతుండటం ఆందోళనకు గురిచేస్తోంది.



పిస్తోళ్లు స్వాధీనం చేసుకొని మాట్లాడుతున్న ఎస్పీ(ఫైల్)

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలో ప్రతి ఏటా వివిధ రకాల నేరాలకు సంబంధించి కేసులు నమోదవుతున్నాయి. హత్యలు, అత్యాచారాలు, దారిదోపిడి, దొంగతనాలు, ఆర్థిక నేరాలు, చీటింగ్, డ్రగ్స్, గంజాయి సరఫరా తదితర కేసులు నమోదవుతున్నాయి. ఆదిలాబాద్ జిల్లాలో 2023 ఏడాదిలో మొత్తం 3275 కేసులు నమోదు కాగా.. 2024లో 3034 కేసులు నమోదయ్యాయి. గతేడాదితో పోల్చితే ఈ ఏడాది నేరాల సంఖ్య స్వల్పంగా తగ్గుముఖం పట్టాయి. ముఖ్యంగా మహిళలపై అఘాయిత్యాలు ఆగడం లేదు. గతేడాది వీటి సంఖ్య 38 ఉండగా 2024లో 45 నమోదు కావడం ఆందోళనకు గురిచేస్తోంది. వీటితో పాటు ఈ ఏడాది 13 హత్య కేసులు, దారిదోపిడీ కేసులు 7వరకు నమోదయ్యాయి. ముఖ్యంగా 2024లో 346 రోడ్డు ప్రమాదాలు సంభవించగా..ఇందులో 133మంది మృతి చెందారు. మిగితా వారు గాయాలపాలయ్యారు. వీటితో పాటు ఆర్థిక నేరాల సంఖ్య సైతం గణనీయంగా పెరిగింది. కిందటేడాది 266 కేసులు నమోదు కాగా ఈ ఏడాది వాటి సంఖ్య 344కు చేరుకున్నాయి. మరోపక్క జిల్లాలో గంజాయి నిర్మూలనకు పోలీసు యంత్రాంగం ఎన్ని విశ్వ ప్రయత్నాలు చేస్తున్నా. దొంగచాటున గంజాయి, డ్రగ్స్ సరఫరా, వినియోగం జరుగుతుండటం ఆందోళనకరంగా మారుతోంది. ఈ ఏడాది 77 కేసులు నమోదయ్యాయి. చీటింగ్ కేసులు సైతం ఈ ఏడాది 190 నమోదు కాగా.. మట్కా కేసులు 30వరకు నమోదయ్యాయి. ముఖ్యంగా ప్రస్తుతం సైబర్ నేరాలు ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. అపరిచిత వ్యక్తుల నుంచి ఫోన్లు రావడం..వివిధ రకాలుగా మభ్యపెడుతూ అకౌంట్‌లో డబ్బులు మాయం చేయడం వంటి పరిణామాలు అధికంగా జరుగుతున్నాయి. ఆదిలాబాద్ జిల్లాలో ఈ ఏడాది 108 కేసులు నమోదు కాగా పోలీసులు 32.28లక్షలను ఫ్రీజింగ్‌లో పెట్టడంతో బాధితులకు ఉపశమనం కలిగించారు.

కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోనూ నేరాల సంఖ్య ఈ ఏడాది పెరగడం ఆందోళనకరంగా మారింది. 2023ఏడాదిలో జిల్లాలో వివిధ రకాల నేరాలు 1063 నమోదు కాగా ఈ ఏడాది 2024లో వాటి సంఖ్య 1207 నమోదయ్యాయి. ఈ జిల్లాలోనూ మహిళలపై అఘాయిత్యాలు జరుగుతున్నాయి. కానీ గతేడాది కంటే మాత్రం స్వల్పంగా తగ్గుముఖం పట్టాయి. హత్యలు, కిడ్నాప్ ఘటనలు సైతం చోటుచేసుకున్నాయి. వీటితో పాటు గంజాయి, ఫోక్సో కేసులు, అట్రాసిటీ కేసులతో పాటు సైబర్ నేరాలు సైతం నమోదు కావడం ఆందోళనకు గురిచేస్తున్నాయి. నిర్మల్ జిల్లాలోనూ ఇదే తరహా కేసులు నమోదయ్యాయి. 2024 ఏడాదిలో జిల్లాలో మొత్తం 3524 కేసులు నమోదయ్యాయి. అత్యధికంగా నిర్మల్ పట్టణంలో 599 కేసులు నమోదయ్యాయి. ఈ జిల్లాలోనూ 39 అత్యాచారం కేసులు నమోదయ్యాయి. హత్య కేసులు 16 నమోదు కాగా.. కిడ్నాప్ కేసులు 34, అధికంగా దొంగతనాలు 466 కేసులు నమోదు భయాందోళనకు గురిచేసింది. ఇందులో రూ.2.19కోట్లు ఆస్తినష్టం సంభవించగా.. పోలీసులు 63.70లక్షలు రికవరీ చేశారు. రోడ్డు ప్రమాదాలు 390వరకు జరగగా 133 మంది మృతి చెందారు. ముఖ్యంగా ఉమ్మడి జిల్లాలో అంతటా ఉన్నట్లే నిర్మల్ జిల్లాలోనూ సైబర్ క్రైం కేసులు నమోదయ్యాయి. ఈ జిల్లాలో 49 కేసులు నమోదు కావడం గమనార్హం. సైబర్‌నేరాల పట్ల పోలీసు యంత్రాంగం అనేక అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నా.. కొందరు ప్రజలు అత్యాశకు పోయి సైబర్ నేరస్తుల వలకు చిక్కుతున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



పట్టుబడిన దొంగల ముఠా(ఫైల్)



తలమడుగు మండలంలో పట్టుబడిన గంజాయి(ఫైల్)

తహసీల్దార్‌కు ఉద్యోగ విరమణ సన్మాన సభ



నవతెలంగాణ-కుభీర్

తహసీల్దార్‌గా విధులు నిర్వర్తించి మంగళవారం ఉద్యోగ విరమణ పొందిన ముంజం సోము, సంధ్య దంపతులను ఘనంగా సన్మానించారు. రెవెన్యూ డివిజన్ అధికారి కోమల్‌రెడ్డి కార్యక్రమానికి హాజరై సోము దంపతులను సన్మాంచారు. కార్యక్రమానికి నియోజకవర్గంలోని అన్ని మండలాల తహసీల్దార్లు, మండల నాయకులు హాజరయ్యారు. సోము మండలంలో కొన్ని రోజులుగా బాధ్యతలు నిర్వర్తిస్తూ ప్రజలకు, రైతులకు అందుబాటులో ఉండి వారికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూశారు. దీంతో ఆయన ప్రజల గుండెల్లో నిలిచిపోయారు. కార్యక్రమంలో ముధోల్ తహసీల్దార్ శ్రీకాంత్, నవీపేట్ తహసీల్దార్ వెంకటరమణ, లోకేశ్వరం తహసీల్దార్ మోతీరాం, ఎంపీడీఓ నవనీత్‌కుమార్, కుభీర్ ఎస్ఐ రవీందర్, కార్యదర్శి అశోక్, స్థానిక నాయకుల గులాబ్ నాయక్, నగేష్, దత్తాత్రి, రఘురామ్ పటేల్, మల్లయ్య, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ పొందిన కార్మికులకు సన్మానం



నవతెలంగాణ - కాసిపేట

మందమర్రి ఏరియాలోని కాసిపేట వన్ ఇంక్లైన్ గనిలో ఉద్యోగ విరమణ పొందిన కార్మికులను ఘనంగా సన్మానించారు. జక్కం ధర్మయ్య, అన్నమనేని సుధాకర్, పెరుగు లింగయ్య ఉద్యోగ విరమణ చేసిన సందర్భంగా శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో గని మేనేజర్ శంకరయ్య, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ దాగం మల్లేష్, రక్షణ అధికారి నిఖిల్ అయ్యర్, పిట్ సెక్రెటరీ లక్ష్మీ నారాయణ, అండర్ మేనేజర్ సుమన్, సంక్షేమ అధికారి మీర్జా గౌస్ జీషాన్, బన్న లక్ష్మన్‌దాస్, వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్ వొడ్నాల రాజన్న, సొల్లంకి శ్రీనివాస్, రంజిత్, పిట్, మైన్ కమిటీ సభ్యులు, ఏఐటీయూసీ, టీబీజీకేఎస్, ఐఎన్టీయూసీ, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి ఇద్దరి మృతి



నవతెలంగాణ-బెజ్జూర్

మండలంలోని ఇప్పలగూడ మొగవెల్లి గ్రామ సమీపంలో సోమవారం ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఒకరు మృతి చెందగా ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... చింతలమానపల్లి మండలం దీండ గ్రామానికి చెందిన మేస్త్రం సాయికుమార్(22) బుగవెల్లి గ్రామానికి చెందిన తన చిన్నమ్మ ఇంటికి రావడంతో మరో ఇద్దరు స్నేహితులు ఆత్రం షణ్ముఖ, నైతం అజయ్తో కలిసి ద్విచక్ర వాహనంతో వెళుతుండగా మొగవెల్లి ఇప్పలగూడ గ్రామ సమీపంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో మేస్త్రం సాయికుమార్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఆత్రం షణ్ముఖ, నైతం అజయ్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ అజయ్ కూడా మరణించినట్టు సమాచారం. ఈ మేరకు సంఘటన స్థలాన్ని ఎస్సై ప్రవీణ్ కుమార్ పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు.

పుష్పగుచ్ఛాలకు బదులు పుస్తకాలు ఇవ్వండి : కలెక్టర్ రాజర్షి షా

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపుతునట్లు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2025వ సంవత్సరం ప్రతి ఒక్కరికి శుభాలను చేకూర్చాలని, ప్రతి కుటుంబం ఆనందంతో గడపాలని, జిల్లా ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని అభిలషించారు. నూతన సంవత్సరంలో సరికొత్త ఆలోచనలు, ఆశయాలు, ఆకాంక్షలతో ముందుకు సాగాలని మరింత పట్టుదల, యిజౌషితో విజయాలను కైవసం చేసుకోవాలని పేర్కొన్నారు. నూతన సంవత్సరం ప్రతి ఒక్కరికి గెలుపునుందించే సంవత్సరం కావాలని ఆకాంక్షించారు. కాగా నూతన సంవత్సరం సందర్భంగా జనవరి 1న ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు క్యాంప్ ఆఫీస్‌లో అందుబాటులో ఉంటానన్నారు. శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చేవారు బొకేలు, పుష్ప గుచ్ఛాలకు బదులు పేద విద్యార్థులకు ఉపయోగపడేలా నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, ఇతర సామగ్రి ఇవ్వాలని, వాటిని త్వరలో విద్యార్థులకు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు.

విద్యుత్ రంగ ప్రయివేటీకరణ విరమించుకోవాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

కేంద్ర ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని ప్రయివేటీకరణ చేసే నిర్ణయాన్ని విరమించుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ డిమాండ్ చేశాడు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్‌చౌక్ వద్ద విద్యుత్ కార్మికుల పోరాట సంఘీభావ దినం సందర్భంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ మూడోసారి ఏర్పడిన మోడీ ప్రభుత్వం గతం కన్నా మరింత దూకుడుగా ప్రజా వ్యతిరేక, వినాశకర విధానాలను అవలంభిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణతో పాటు పలు రాష్ట్రాల్లో డిస్కంల ప్రయివేటీకరణకు కేంద్ర ప్రభుత్వం బీజం వేసిందన్నారు. అదాని లాంటి కార్పొరేట్లకు దొడ్డి దారిన టెండర్లు కట్టబెడుతూ విద్యుత్ రంగాన్ని నిర్వీర్యం చేసే దిశగా ప్రయత్నాలు చేస్తోందని మండిపడ్డారు. విద్యుత్ రంగ పరిరక్షణ కోసం రానున్న రోజుల్లో పోరాటాలు చేయనున్నట్లు హెచ్చరించారు.



ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు పెరక శ్రీకాంత్, జిల్లా కమిటీ సభ్యులు వెలిశాల క్రిష్ణమాచారి, జిల్లా నాయకులు నంది పద్మ, సమ్మయ్య, మాట్ల రాజు, దుర్గప్రసాద్ పాల్గొన్నారు.

ఆదివాసీ సమాజాభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆదివాసీ సమాజాభివృద్ధి కోసం సమిష్టిగా కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని గోండ్వానా పంచాయతీ రాయి సెంటర్, రాజ్ గౌడ్ సేవా సమితి భవనంలో భవిష్యత్తు కార్యాచరణపై సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు ఆదివాసీ నాయకులు ఆదివాసులు ఎదుర్కొంటున్న సమస్యలపై మాట్లాడారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లాలో గిరిజన గ్రామాలలో టైగర్ కారిడార్‌తో ఏర్పడే ఇబ్బందులను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఆదివాసులు ఎదుర్కొంటున్న ప్రధానమైన పోడు భూముల సమస్యల విషయంలో అటవీ, రెవెన్యూ భూములకు సంబంధించిన సమస్యలను పరిష్కరించుకునేందుకు ఐక్యంగా ముందుకు వెళ్లాలన్నారు. విద్యాపరంగా ఐటీడీఏ ఆశ్రమ పాఠశాలలో మౌలిక సదుపాయాలు,



గిరిజన గ్రామాల అభివృద్ధి కార్యక్రమాలు ముందుకు తీసుకువెళ్లేందుకు రాయి సెంటర్‌లు కీలకంగా వ్యవహరించాలని సూచించారు. క్షేత్రస్థాయి నుండి ఆదివాసులు బలోపేతం కావాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ సమావేశంలో గోండ్వానా జాతీయ నాయకుడు సిడాం అర్జున్ మాస్టర్, జిల్లా సర్మేడి మోతీరామ్, రాజ్ గోండ్ సేవా సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెందుర్తి సుధాకర్, జిల్లా కార్యదర్శి నరసింగరావు, నాయకులు జ్ఞానేశ్వర్, యశ్వంత్‌రావ్, శంకర్, భీంరావు, సెంటర్ల సర్మేడీలు పాల్గొన్నారు.

జిల్లాలో 18 మందికి పోలీస్ సేవా పథకాలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాలో 18 మందికి పోలీసు పథకాలు వచ్చినట్లు ఎస్పీ గౌస్ ఆలం మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా పథకాలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. 18 మందిలో ఇద్దరికీ ఉత్తమ సేవ, 16 మందికి సేవ పథకాలు వచ్చాయని పేర్కొన్నారు. పథకాలు అందుకోనున్న అధికారులకు అభినందనలు తెలిపారు. పోలీసు వ్యవస్థలో విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచి, విధులలో అంకితభావం, క్రమశిక్షణతో అహర్నిశలు కష్టపడిన వారికి తగిన ప్రతిఫలం లభిస్తుందని పేర్కొన్నారు.

ఉత్తమ సేవా పథకాలను పొందిన అధికారులు

1) సలాం దిలీప్, ఏఎస్ఐ ఉట్నూర్,

2) సయ్యద్ అన్వర్ ఉల్ హక్, డిఎస్‌బి ఎస్ఐ

సేవా పథకం పొందిన అధికారులు.

1) సిహెచ్ నాగేందర్, ఉట్నూర్ డిఎస్‌పి

2) కె ఆర్ సురేందర్ రెడ్డి, డిసిఆర్బి డిఎస్పి

3) ఎస్ శేషారావు, రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్, అటాచ్ నిజామాబాద్

4) జి గౌరయ్య, ఏఆర్ ఎస్ఐ, ఎ ఆర్ అదిలాబాద్

5) రాథోడ్ మారుతి, ఏఎస్ఐ, నేరడిగొండ

6) జె గుణ్వంత్, ఏఆర్‌ఎస్ఐ, ఏఆర్ ఆదిలాబాద్

7) పి గోవిందరావు, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్, ఆదిలాబాద్

8) రాథోడ్ భరత్, హెడ్ కానిస్టేబుల్ డిటిసి

9) బి సంతోష్ హెడ్ కానిస్టేబుల్ డిసిఆర్బి

10) జె భారతి, ఉమెన్ హెడ్ కానిస్టేబుల్, డబ్ల్యూపీఎస్

11) బి గంగారెడ్డి, గుడిహత్నూర్ పోలీస్‌స్టేషన్

12) ఎం దేవిదాస్, రూరల్ పోలీస్ స్టేషన్

13) ఎస్ సీతారామరాజు, ఏఆర్ కానిస్టేబుల్

14) ఎం భూమన్న, ఏఆర్ కానిస్టేబుల్

15) ఎస్ స్వామి, జైనథ్ పోలీస్ స్టేషన్

16) సిహెచ్ దేవిదాస్, డిస్ట్రిక్ స్పెషల్ బ్రాంచ్ ఆదిలాబాద్

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
బుధవారం | జనవరి 01, 2025 | www.navatelangana.com

ధర్మ సమాజ్ పార్టీ కుచులాపూర్ గ్రామ కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-బోథ్

మండలంలోని కుచులాపూర్ గ్రామంలోని మంగళవారం ధర్మ సమాజ్ పార్టీ మండల అధ్యక్షులు కొండమడుగు గణేష్ మహారాజ్ ఆధ్వర్యంలో ధర్మ సమాజ్ పార్టీ కుచులాపూర్ గ్రామ కమిటీని




ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా కారం నరేష్, ఉపాధ్యక్షులు బత్తుల అడెల్లు, ప్రధాన కార్యదర్శిగా మాకునూరి సంతోష్, కోశాధికారిగా బిక్క, గోపీచంద్, కార్యదర్శిగా బిక్క సత్యనారాయణ, కమిటీ సభ్యులుగా సింగారపు లక్ష్మణ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎలక్షన్ ఇన్చార్జిగా కుందూరు సుధాకర్, నాయకులు బిక్క రమేష్ పాల్గొన్నారు.

నెల రోజులు పోలీస్ 30 యాక్ట్

నవతెలంగాణ-నిర్మల్

నిర్మల్ జిల్లాలో శాంతి భద్రతల దృష్ట్యా, ప్రశాంతతను పెంపొందించేందుకు 01 జనవరి 2025 నుంచి 31 జనవరి 2025 వరకు, జిల్లా అంతటా 30 పోలీస్ యాక్ట్ 1861 అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ 30 పోలీస్ యాక్ట్ 1861 అమలులో ఉన్నందున జిల్లాలో సబ్ డివిజనల్ పోలీస్ అధికారి లేదా పోలీస్ ఉన్నత అధికారుల నుంచి అనుమతి లేకుండా ఎటువంటి పబ్లిక్ మీటింగులు, ఊరేగింపులు, ధర్నాలు జరుపరాదు. నిషేధిత ఆయుధములు అయిన కత్తులు, చాకులు, కర్రలు, జెండా కర్రలు, దుడ్డుకర్రలు, తుపాకులు, ప్రేలుడు పదార్థములు, నేరమునకు పురిగొల్పే ఎటువంటి ఆయుధములను వాడరాదని తెలిపారు. ప్రజలకు ఇబ్బంది, చిరాకు కలిగించేందుకు దారితీసే పబ్లిక్ మీటింగ్‌లను, జనసమూహం పోగు అవుట వంటివి నిషేధమని తెలిపారు. రాళ్లను జమ చేయుట, ధరించి సంచరించుట వంటివి నిషేధమని తెలిపారు. లౌడ్ స్పీకర్‌లు, డీజే లు వంటివి సైతం ఈ సమయంలో నిషేధము ఉంటాయని తెలిపారు. నియమాలు ఎవరైనా ఉల్లంఘించిన 30 పోలీస్ యాక్ట్ 1861 కింద శిక్షార్హులు అగుదురని హెచ్చరించారు.

నెల రోజుల పాటు ఆపరేషన్ స్మైల్



నవతెలంగాణ-నిర్మల్

జనవరిలో నెలరోజుల పాటు ఆపరేషన్ స్మైల్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు అదనపు ఎస్పీ ఉపేందర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపరేషన్ స్మైల్ కార్యక్రమం ద్వారా తప్పిపోయిన పిల్లలను గుర్తించడం, బాల కార్మికులుగా పని చేస్తున్న చిన్నారుల సమస్యలను పరిష్కరించడం, అక్రమ రవాణాకు గురైన చిన్నారులను రక్షించి వారికి పునరావాసం కల్పించడం జరుగుతుందన్నారు. చట్టపరమైన హక్కులు, రక్షణ కల్పిస్తామన్నారు. పిల్లల హక్కులను కాపాడేందుకు పోలీసు విభాగం, ఇతర విభాగాలు కలిసి బృందాలుగా ఏర్పడి రైల్వే స్టేషన్లు, బస్ స్టాండ్లు, ఫ్యాక్టరీలు, వాణిజ్య సంస్థలు, ఇతర ప్రదేశాలను సందర్శించి బాల కార్మికులుగా పని చేస్తున్న పిల్లలను గుర్తించేందుకు చర్యలు చేపడతారని వివరించారు. గల్లంతైన, బాల కార్మికులుగా బాధపడుతున్న పిల్లలను రక్షించడం సమాజ పునాదులను బలోపేతం చేయడంలో కీలకమైన చర్యని, పిల్లల భవిష్యత్తును రక్షించడం ద్వారా సమాజంలో ఒక శక్తివంతమైన మార్పును తీసుకురావచ్చని తెలిపారు. ఈ కార్యక్రమం పిల్లల హక్కులను కాపాడుతూ వారి భవిష్యత్తును మెరుగ్గా తీర్చిదిద్దే దిశగా ముందడుగు వేస్తోందన్నారు. చైల్డ్‌లైన్ 1098, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, స్వచ్ఛంద సంస్థల సహకారంతో పిల్లలకు తక్షణ సాయం అందించబడుతుందని పేర్కొన్నారు. పిల్లల పేర్లు, సమాచారం, కుటుంబ కట్టుబాట్ల గురించి పూర్తి వివరాలు సేకరించి, వారిని వారి కుటుంబాలకు తిరిగి చేర్చేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ చైర్మెన్ ఎండీ వాహీద్, నాగలక్ష్మి ఏసీడీపీఓలు, ఎస్సైలు ప్రదీప్, నరేష్, షీటీం మహిళా ఎస్సై సుమంజలి, సీడబ్ల్యూసీ ప్రతినిధి సిమోయిన్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

చిరుత దాడిలో ఆవు మృతి



నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని మారుమూల గిరిజన గ్రామమైన నందిగామ గుట్టపై మేత మేసేందుకు వెళ్లిన ఆవుపై చిరుతపులి దాడి చేసిన సంఘటన మంగళవారం మండలంలో చోటు చేసుకుంది. బరంపూర్ గ్రామానికి చెందిన రైతు కేదారేశ్వర్‌రెడ్డి ఆవు ఎప్పటిలాగా సోమవారం మేతకు వెళ్లగా ఆవు తిరిగి సాయంత్రం ఇంటికి రాకపోవడంతో మంగళవారం రైతుతో పాటు మరి కొంతమంది గ్రామస్తులు కలిసి ఆవు కోసం గాలించగా నందిగామ గుట్టపై చిరుత దాడిలో మరణించినట్టు రైతు తెలిపారు. ఆవు విలువ దాదాపు రూ.30వేల వరకు ఉంటుందన్నారు. సంఘటన స్థలానికి పశు వైద్యాధికారి మేకల లావణ్య ఆవుకు పోస్ట్‌మార్టం నిర్వహించారు. విషయం తెలుసుకున్న అటవీశాఖ ఎఫ్ఆర్‌ఓ పుండలిక్, ఎఫ్ఎస్ఓలు సయ్యద్ ఇమ్రాన్, రవీందర్, విశ్వజిత్, ప్రశాంత్, శివ చరణ్, సంఘటన స్థలానికి చేరుకొని మృతి చెందిన ఆవును పరిశీలించగా చిరుత దాడిలో మరణించినట్లు తెలిపారు. బాధిత రైతుకు నష్టపరిహారం ఇప్పించాలని అటవీశాఖ అధికారులను కోరారు.

మండలంలో చిరుతపులులతో భయం భయం...

మండలంలోని కప్పర్‌దేవి, ఉమ్రి, కోసాయి, దేగామా, పల్సి(బి) తాండ, పల్సి(కె), రత్నాపూర్, కొత్తూర్, దోర్లి, కుచులాపూర్ గ్రామాల శివారు ప్రాంతాలలో ఎద్దును, ఆవును, మేకలను గత రెండు నెలల కింద చిరుత దాడికి గురై మరణించగా మండల ప్రజలు చిరుత పులులతో ఏ ప్రమాదం ఎప్పుడు ముంచుకొస్తుందోనని భయం భయంగా మండల ప్రజలు కాలం వెల్లదీస్తున్నారు. చేను పనులకు వెళ్లాలంటేనే భయంతో మండల ప్రజలు, రైతులు, కూలీలు జంకుతున్నారు. ఇప్పటివరకు అటవీశాఖ అధికారులు మారుమూల గ్రామాల ప్రజలను ఎలాంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించలేదని అన్నారు. ఇప్పటికైనా అటవీశాఖ అధికారులు మండల ప్రజలను అప్రమత్తం చేయాల్సిందిగా కోరుతున్నారు.

చేతులకు సంకెళ్లతో నిరసన



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం నిర్మల్ పట్టణంలో వినూత్నంగా తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చేతులకు సంకెళ్లు వేసి తాడుతో కట్టుకుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నిన్న జరిగిన మంత్రివర్గ సమావేశంలో సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఏటువంటి న్యాయం జరగనందున ఉద్యోగులందరూ సమయమనం పాటించి సమ్మె కొనసాగించాలని, న్యాయం జరిగే వరకూ సమ్మెను కొనసాగించాలని, ఉద్యోగులందరూ ప్రభుత్వానికి, అధికారులకు వ్యతిరేకులు కారని తెలుపుతూ చర్చల పేరుతో ప్రభుత్వం కాలయాపన చేస్తూ, ఇటు ఉద్యోగులు, విద్యార్థుల భవిష్యత్తు నాశనం చేస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు సింగారి వెంకటేష్ శిబిరాన్ని సందర్శించి వారికి మద్దతు తెలిపారు. కేజీబీవీల్లో విద్యాబోధన జరగక విద్యార్థులు చాలా నష్టపోతున్నారని, ఈ తరుణంలో, ముఖ్యమంత్రి ఇంత మొండిగా వ్యవహరించడం తగదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇలాగే నిర్లక్ష్యం చేస్తే పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని, రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు రవి, రాజ్ వెంకటేష్ పాల్గొన్నారు.

రెగ్యులరైజ్ చేసే వరకు ఉద్యమం ఆగదు...

ఆదిలాబాద్‌టౌన్ : సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించే వరకు తమ పోరాటాన్ని కొనసాగిస్తామని ఆ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పడాల రవీందర్ స్పష్టం చేశారు. ప్రభుత్వం చర్చల సందర్భంగా ఆర్థిక అంశాలపై స్పష్టత ఇవ్వకుండా కమిటీలు వేస్తామని చెప్పడం విచారకరమన్నారు. కలెక్టరేట్ ఎదుట కొనసాగుతున్న ఉద్యోగుల సమ్మె మంగళవారం 22వ రోజుకు చేరుకుంది. ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఉద్యోగులు కలెక్టర్ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడారు. సీఎం నాడు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాల్సిందేనని డిమాండ్ చేశారు. తాము కోరుతున్నది గొంతెమ్మ కోరికలు కావని, 22 రోజులుగా శాంతియుత సమ్మె చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షురాలు ప్రియాంక, ప్రధాన కార్యదర్శి ధరమ్ సింగ్, వెంకటి, పార్థసారథి, శ్రీకాంత్, కేశవ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్ ఉపాధ్యాయులపైనే

- ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విద్యార్థుల భవిష్యత్ ఉపాధ్యాయులపైనే ఉందని వారిని మంచి మార్గంలో నడిపేందుకు, ఉన్నత శిఖరాలకు చేరుకొనేలా కృషి చేయాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ఆరోగ్య కళాశాలలో భాగంగా మంగళవారం జడ్పీ సమావేశ మందిరంలో ఇంటర్ విద్యార్థుల కోసం రూపొందించిన అభ్యాస దీపికలను ఆవిష్కరించి, కళాశాల ప్రిన్సిపాల్స్, లెక్చరర్లకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో మంచి ఆరోగ్య అలవాట్లను, మార్పుకు ఆరోగ్య పాఠశాల, కళాశాల రూపొందించడం జరిగిందని తెలిపారు. ఆరు సూత్రాలపై అవగాహన కల్పించి, విద్యార్థులు పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించేందుకు, పరీక్షల సమయంలో ఒత్తిడికి గురికాకుండా సజావుగా పరీక్షలు రాసేందుకు, విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దేందుకు ప్రణాళిక ప్రకారం అభ్యాస కరదీపికలు అర్థమయ్యేలా వివిధ ప్రిన్సిపాల్స్, లెక్చరర్ల సహాయంతో రూపొందించామన్నారు. కళాశాలలకు విద్యార్థులు రోజూ వచ్చేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని, గైర్హాజరు కాకుండా చూడాలని తెలిపారు. గైర్హాజరైన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని, అవసరమైతే హోమ్ విసిట్ చేయాలని సూచించారు. ఏబీసీలుగా ఏర్పాటు చేసి విద్యార్థులను అడాప్ చేసుకొని, రివిజన్‌లో, ప్రత్యేక తరగతులలో ఈ కరదీపికలు ఉపయోగించి అభ్యాస సామర్థ్యాలను పెంపొందించాలని సూచించారు. ఈ సందర్భంగా వివిధ సబ్జెక్టులపై తెలుగు, హిందీ, మ్యాథ్స్, కెమిస్ట్రీ, ఇంటర్నెట్, ఫిజిక్స్, చరిత్ర, తదితర వాటిపై అభ్యాస కరదీపికలు రూపొందించిన ఉపాధ్యాయులు, రిసోర్స్ పర్సన్‌లతో రూపొందించిన తీరును వారి మాటల్లోనే తెలుసుకున్నారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి సి.రవీందర్, ప్రిన్సిపాల్ జే.గణేష్ కుమార్, కే.విఠల్, బి.భగవంత్లు, కే.సుదర్శన్, ఎస్.సూర్యప్రకాష్, బి.శంకర్, ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపాల్, లెక్చరర్లు, సబ్జెక్టు రిసోర్స్ పర్సన్‌లు పాల్గొన్నారు.

చలి ప్రభావం నుంచి నారుమడిని సంరక్షించుకోవాలి



నవతెలంగాణ-పెంబి

వర్షాకాలం సీజన్ ముగియడంతో మండల వ్యాప్తంగా రైతులు ప్రస్తుతం ఎండాకాలం సాగుకు సంబంధించి వరి నారుమళ్లను సిద్ధం చేసుకుంటున్నారని మండల వ్యవసాయాధికారి నవీన్ తెలిపారు. మంగళవారం ఇటిక్యాలలో వ్యవసాయ విస్తరణ అధికారి రాజ్ కుమార్‌తో కలిసి ప్రస్తుతం రాత్రి వేళల్లో నమోదవుతున్న తీవ్ర మైన అత్యల్ప ఉష్ణోగ్రతలు, చలి ప్రభావం నుంచి రబీ సీజన్‌కు సంబంధించిన వరి నారుమళ్లను సంరక్షించుకునే విధానాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ చలి ప్రభావం కారణంగా భూమి నుంచి తగిన మోతాదులో పోషకాలను గ్రహించని కారణంగా నారులో ఎదుగుదల కనిపించదని తెలిపారు. జింకు, ఇనుపదాతు లోపల లక్షణాలు అధికంగా కనిపించే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ ప్రభావం నుంచి నారును సంరక్షించుకునేందుకుగాను సాయంకాలం వేళలో మడిలోని నీటిని తీసివేసి, కొత్తగా నీటిని పారించడంతో పాటుగా ఉదయాన్నే ఆ నీటిని మళ్లీ తొలగించాలన్నారు. అలాగే సాయంకాలం వేళలో నారుమడులపై పాలిథిన్ షీట్లు గాని, కవర్లు కప్పడం ద్వారా చలి ప్రభావం నుంచి నారుడు సంరక్షించుకోవచ్చు అని తెలిపారు. మొక్కలలో తీవ్రమైన ఎదుగుదల లోపలు, లక్షణాలు కనిపించినట్లయితే లీటర్ నీటికి రెండు గ్రాముల చొప్పున 19-19-19 అనే నీటిలో కరిగే ఎరువును లేదా నానో డీఏపీ 2-4 గ్రాములు లీటర్ నీటికి చొప్పున కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు. జింకు లోపల లక్షణాలు కనిపించినట్లయితే లీటర్ నీటికి రెండు గ్రాముల చొప్పున జింక సల్ఫేట్‌ను కలిపి పిచికారి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇటిక్యాల, కిష్టు నాయక్ తండా రైతులు పాల్గొన్నారు.

ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ స్టేట్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ నూతన సంవత్సర 2025 క్యాలెండర్‌ను ప్రెసిడెంట్ మమ్మద్ రియాజ్‌తో కలిసి మాజీ మంత్రి జోగు రామన్న మంగళవారం ఆయన నివాసంలో ఆవిష్కరించి, జిల్లా ప్రజలకు ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. బీఆర్ఎస్ కుటుంబ సభ్యులు, పార్టీ కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. 2024 స్వస్తి చెప్తూ 2025 కు స్వాగతం చెబుతున్నామని ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ న్యూఇయర్ వేడుకలను ఆనందంగా జరుపుకుంటూ, 2025 ప్రతి ఒక్కరికి మంచి జరగాలని దేవుని కోరుతున్నామన్నారు. న్యూఇయర్ వేడుకలలో ఎలాంటి అపాశ్రుతికి తావివ్వకుండా ఆనందంగా జరుపుకోవాలని కోరారు. కొత్త సంవత్సరం కొత్త ఆలోచనలతో ప్రతి ఒక్కరూ ముందుకు పోవాలని ఆకాంక్షించారు.

నిర్మల్ ఉత్సవాలను విజయవంతం చేయాలి

- నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



నవతెలంగాణ-నిర్మల్

నిర్మల్ ఉత్సవాలకు ఘనంగా నిర్వహించేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్మల్ ఉత్సవాల కార్యక్రమం ఏర్పాట్లపై నిర్వహించిన సమావేశంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్‌లతో కలిసి ఈ సందర్భంగా మాట్లాడారు. ఈ నిర్మల్ ఉత్సవాలు పేరిట జనవరి 6నుంచి 8వ తేదీ వరకు పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు సందర్శకులకు అనుమతి ఉంటుందని తెలిపారు. సాయంత్రం వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని, అధికారులకు కేటాయించిన బాధ్యతలను పకడ్బందీగా నిర్వహించి నిర్మల్ ఉత్సవాల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. నిర్మల్ ఉత్సవాలలో భాగంగా నిర్మల్ చరిత్ర తెలిసేలా వివిధ శాఖల నుంచి స్టాళ్లను ఏర్పాటు చేయాలన్నారు. మహిళా స్వయం సంఘాల ఉత్పత్తులు, వ్యవసాయ, కొయ్య బొమ్మలు, పెయింటింగ్స్, హస్త కళలు, పుస్తకాలు, దుస్తులు, తినుబండారాల స్టాళ్లను ఏర్పాటు చేయాలని తెలిపారు. నిర్మల్ ఉత్సవాల కార్యక్రమంపై హోర్డింగ్‌లు, కరపత్రాల ద్వారా ప్రజలకు విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. జిల్లాకు చెందిన ప్రముఖ వ్యక్తులను గుర్తించి వారిని ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం చేయాలని తెలిపారు. నిర్మల్ జిల్లా చరిత్రను తెలిపే విధంగా పుస్తక ప్రదర్శనను ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రజలను ఆకట్టుకునే విధంగా అందమైన విద్యుత్ దీపాలతో ముస్తాబు చేయాలని తెలిపారు.

కార్యక్రమానికి వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. పార్కింగ్ ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలనీ, అగ్నిమాపక, అత్యవసర వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని సూచించారు. ఆసక్తి కలిగిన ప్రజలు ఎవరైనా తమ ఉత్పత్తుల స్టాళ్లను ఈ కార్యక్రమంలో ఏర్పాటు చేయాలనుకుంటే ఈ వెబ్‌సైట్ ద్వారా తమ వివరాలను నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఇతర వివరాల కోసం 9849913071 ఫోన్ నెంబరును సంప్రదించాలాన్నారు. సమావేశంలో ప్రణాళిక అధికారి జీవరత్నం, డీవైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, డీఈఓ పి.రామారావు, డీఆర్డీఓ విజయలక్ష్మి, డీపీఓ శ్రీనివాస్, లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్‌గోపాల్, డీఎంహెచ్ఓ రాజేందర్, డీఎస్ఓ కిరణ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, డీపీఆర్ఓ విష్ణువర్ధన్, మెప్మా పీడీ సుభాష్, తహసీల్దార్ రాజు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన విద్యనందించాలి

నవతెలంగాణ-ఉట్నూర్



ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలని ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తా ఉపాధ్యాయులను ఆదేశించారు. మంగళవారం మండలంలోని ఆశ్రమ పాఠశాల, టీడబ్ల్యూపీఎస్ హస్నాపూర్, రాంపూర్(కె) అంగన్‌వాడీ కేంద్రాన్ని పీఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రాంపూర్ పాఠాశాలకు కాలినడకన వెళ్తూ మార్గ మధ్యంలో పత్తి ఏరుతున్న రైతులతో ముచ్చటించి, వ్యవసాయ సాగు గురించి అడిగి తెలుసుకున్నారు. రాంపూర్ పాఠశాలను, అంగన్‌వాడీ కేంద్రం మూసి ఉండటంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు అందిస్తున్న విద్యా వైద్యం, భోజనంపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల అటెండెన్స్, స్టాక్ రిజిస్టార్లను పరిశీలించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ప్రతిరోజూ డైట్ మెనూ ప్రకారం పోషక విలువలు గల పచ్చి ఆకు కూరగాయల ఆహారాన్ని, మొవా లడ్డు, గుడ్లు, పాలు, రాగి, మాల్టా అందించాలని సూచించారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలనీ అన్నారు. నిత్యం పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రతిరోజు వంటగది, స్టోర్ రూమ్, తాగునీరు, మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం తరగతి గదిలో విద్యార్థులకు పాఠాలు భోదించారు. దోమల వలన వ్యాపించే డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా, వసతి గృహ పరిసరాలలో పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గురువు సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయి



నవతెలంగాణ-తాంసి

తమ విధి నిర్వహణలో సమర్థవంతంగా విధులు నిర్వహిస్తూ విద్యార్థుల భవితవ్యం తీర్చిదిద్దే గురువులు సదా గుర్తుండి పోతారని డీఈఓ ప్రణీత అన్నారు. మంగళవారం భీంపూర్ మండలంలోని అర్లి(టి) ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహించిన శ్రీధర్‌రెడ్డి మంగళవారం ఉద్యోగ విరమణ చేశారు. విరమణ కార్యక్రమాన్ని పాఠశాలలో నిర్వహించగా, ముఖ్యఅతిథిగా డీఈఓ పాల్గొన్నారు. ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూ, మంచినీటి ఆర్వో ప్లాంట్, సౌండ్ సిస్టం, కంప్యూటర్ల ఏర్పాటు కోసం రూ.2లక్షల వరకు విరాళంగా అందజేశారు. డీఈఓ మాట్లాడుతూ తమ వేతనంలో కొంత విద్యార్థుల అవసరాల కోసం బడి కోసం వెచ్చించేవారు అరుదుగా ఉంటారని గుర్తు చేశారు. తన ఉద్యోగ విరమణ కార్యక్రమానికి పూల బొకేలు శాలువాలతో బదులుగా విద్యార్థులకు అవసరమైన స్టడీ మెటీరియల్ ఇవ్వాలన్న శ్రీధర్‌రెడ్డి ఆదర్శనీయులు అన్నారు. విద్యార్థులు వారి తల్లిదండ్రులు హెచ్ఎం చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ శ్యాంసుందర్, ఉపాధ్యాయులు శ్రీకాంత్, విజయలక్ష్మి, మహేష్, నాయకులు లస్మన్న, అశోక్, నితిన్, నవీన్, ఉల్లాస్ ఉన్నారు.

పత్తిలో నాణ్యతలేదని ధరలో కోత పెట్టడం సరికాదు



నవతెలంగాణ-బోథ్

పత్తిలో నాణ్యత లేదని, మద్దతు ధరలో కోత పెట్టడం సరికాదని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షులు సంగెపు బొర్రన్న అన్నారు. మంగళవారం మండలంలోని స్థానిక బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అత్యధికంగా ప్రతి సంవత్సరం పత్తి సాగువిస్తీర్ణం పెరుగుతుందన్నారు. ఈ ఏడాదిలో ఆదిలాబాద్ జిల్లాలో 4 లక్షల 22 వేల ఎకరాలలో పత్తి సాగు సాగుచేస్తున్నారని తెలిపారు. పంట కొనుగోలు ప్రారంభంలో తేమ ఎక్కువగా ఉందని మద్దతు ధరలో కోత పెట్టిన సంగతి అందరికి తెలిసిందేనని అన్నారు. కానీ ప్రస్తుతం పత్తి నాణ్యత లేదంటూ ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే ఒక క్వింటాల్‌కు జిల్లాలో రూ.50 బోథ్‌లో రూ.100 తగ్గిస్తూ సీసీఐ అధికారులు మార్కెట్ అధికారులకే నివేదిక ఇవ్వడం జరిగిందన్నారు. నూతన సంవత్సరం జనవరి రెండు నుంచి పత్తి నాణ్యత 8 శాతం ఒక క్వింటాల్‌కు ధర రూ.7,471కి కొనుగోలు చేస్తామని ప్రకటించడం జరిగిందన్నారు. అలాగే రైతులకు ఏ పంటలోనైనా ఎప్పుడు చూసిన నష్టపరిచే విధానమే అవలంబిస్తున్న సందర్భం కనిపిస్తోందన్నారు. పింజా పొడువులో 30.5 ఎంఎం ఉండేదన్నారు. ప్రస్తుతం పింజాపొడువు తగ్గుదల ఉండటంతో ధరలో కోత విదిస్తున్నారని అన్నారు. మొదటగా పత్తి నాణ్యత ఉంటే ధరలో కూడా రిమీనింగ్ బ్యాలెన్స్ కలుపాలి కానీ పత్తి నాణ్యత లేదని ధరలో కూడా వివక్షత చూపిస్తున్నరని సీసీఐ అధికారులు ఇప్పటికైనా పత్తి నాణ్యతను బట్టి కొనుగోలు చేసి రైతులకి ధర తగ్గకుండా చూడలని కోరారు. సమావేశంలో రైతులు రవి, సుభాష్, బాలాజీ, సుధాకర్, గోపి ధన్సింగ్, పాల్గొన్నారు.

మాదిగల అంబేద్కర్ సంఘం అధ్యక్షుడిగా దుమ్మ నరేష్

నవతెలంగాణ-నేరడిగొండ

మండల మాదిగల అంబేద్కర్ సంఘం అధ్యక్షుడిగా నారాయణపూర్ గ్రామానికి చెందిన దుమ్మ నరేష్‌ని మంగళవారం రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షులు కత్తి గంగాధర్ నియమించారు. తనను అధ్యక్షునిగా నియమించినందుకు రాష్ట్ర కమిటీకి ధన్యవాదాలు తెలిపారు.

టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా జిల్లా వాసి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈనెల 28, 29, 30 తేదీలలో మూడు రోజుల పాటు నల్లగొండ జిల్లాలో జరిగిన తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(టీఎస్‌యూటీఎఫ్) రాష్ట్ర మహాసభలలో నూతనంగా ఎన్నికైన రాష్ట్ర కమిటీలో జిల్లా వాసికి చోటు దక్కింది. రాష్ట్ర కార్యదర్శిగా ఆరవసారి ఏకగ్రీవంగా జిల్లా వాసి సంఘం జిల్లా అధ్యక్షురాలు వైద్య శాంతి కుమారి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని ఉపాధ్యాయుల సమస్యలు రాష్ట్ర సంఘం తరఫున ప్రభుత్వం వరకు చేరుకునే విధంగా తన వంతు కృషి చేస్తానని తెలిపారు. నూతనంగా ఎన్నికైన రాష్ట్ర కార్యదర్శికి జిల్లా కమిటీ సభ్యులు కాంపెల్లి ఉషన్న, జిల్లా ఉపాధ్యక్షులు సోయం ఇందూ రావు, ప్రీతి, కోశాధికారి రమేష్, జిల్లా కార్యదర్శులు హేమంత్ షిండే, రాజ్ కమలాకర్ రెడ్డి, దుర్గయ్య, మొహపత్ రావు, సుభాష్ జాదవ్, మహిపాల్, శ్రీనివాస్, తులసీరామ్, సమ్మయ్య, నవీన్, త్రిమూకరావు అభినందనలు తెలిపారు.

నవతెలంగాణ క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-పెంచికల్‌పేట్



మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎస్సై కొమురయ్య, ఎంపీడీఓ ఆల్బర్ట్ నవతెలంగాణ నూతన సంవత్సరం 2925 క్యాలెండర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా పత్రికలు పనిచేస్తాయని, ప్రతి గ్రామంలోని సమస్యలను ఎప్పటికప్పుడు తెలియజేస్తాయన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ సురేష్, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

భయభ్రాంతులకు గురి చేయడం సరికాదు



నవతెలంగాణ-సిర్పూర్(టి)

కాగజ్‌నగర్ మండలంలోని నందిగూడ గ్రామంలో ఫారెస్ట్ అధికారులు గ్రామస్తులను భయపెట్టకుండా, అవగాహన కార్యక్రమాలను చేపట్టాలని బీఆర్ఎస్ మండల కన్వీనర్ అస్లాం బిన్ అబ్దుల్లా అన్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పట్ట భూమిలో అధికారులు అడుగు పెట్టిన ఉపేక్షించేది లేదని, గ్రామస్తుల భద్రత, హక్కుల రక్షణ కోసం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సి పోయి గ్రామస్తులకు పూర్తి సమాచారం ఇవ్వకుండా వ్యక్తిగత వివరాలు అడగటం సరికాదన్నారు. నందిగూడ గ్రామంలో నివాసిస్తున్న ప్రతి ఒక్కరికీ తమ హక్కుల గురించి అవగాహన కల్పించేలా ఫారెస్ట్ అధికారుల చర్యలపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఫారెస్ట్ అధికారుల తీరు గ్రామస్తులకు అనుమానం కలిగించే విధంగా ఉందన్నారు. గ్రామస్తుల సమస్యలను పరిష్కరించడానికి, సంబంధిత అధికారులతో సమన్వయం చేస్తామన్నారు. కార్యక్రమంలో సిర్పూర్ పట్టణ అధ్యక్షులు ఎలములే నందజీ, సీనియర్ నాయకులు షేక్ చంద్, యూత్ మండల అధ్యక్షులు అజ్మీరా రవి వెర్మా పట్టణ సెక్రటరీ వైజ్ హుస్సేన్, మాఖ్దీర్ హుస్సేన్ పాల్గొన్నారు.

పిల్లలకు పౌష్టికాహారం అందించాలి



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు పౌష్టికాహారాన్ని అందేలా చూడాలని సీడీపీఓ విజయలక్ష్మి అన్నారు. మండలంలోని ఎలుకపెల్లి అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులను సక్రమంగా ఉంచాలని సూచించారు. ప్రతి ఒక్కరికి పౌష్టికాహారం అందేలా చూడాలని, అంగన్‌వాడీ కేంద్రాలకు పిల్లలు వచ్చేలా వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హసీనా, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం పరిశీలన



నవతెలంగాణ-బెజ్జూర్

మండల కేంద్రంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రాజ్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. వారి ధాన్యంలో తేమను పరిశీలించారు. రైతుల వద్ద నుంచి సేకరించిన ధాన్యాన్ని వెనువెంటనే మిల్లులకు పంపించాలని సూచించారు. కేంద్రాల వద్ద రైతులకు సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ఆయన వెంట ఐకేపీ సీసీ భద్రయ్య, ఏఈఓ మీనా ఉన్నారు.

సర్వేను పకడ్బందీగా చేపట్టాలి



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

ఇందిరమ్మ ఇండ్ల సర్వేను ప్రతి గ్రామపంచాయతీలో పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీఓ అల్బర్ట్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువయ్యేలా చూడాలన్నారు. లబ్ధిదారులకు పథకాలు అందేలా కృషి చేయాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు ఎప్పటికప్పుడు చేయించాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

జనవరి 5 వరకే వడ్ల కొనుగోలు

నవతెలంగాణ-కౌటాల

జనవరి 5 వరకే వడ్ల కొనుగోలు చేస్తామని ఆ లోపు రైతులు పండించిన వడ్లను కొనుగోలు కేంద్రంకు తెచ్చుకోవాలని గురుడుపెట్ సహకార సంఘం సీఈఓ రాజేష్ తెలిపారు. రైతులు పండించిన వడ్లను ఈనెల 5 వరకు కొనుగోలు కేంద్రంలోకి తెచ్చుకోవాలన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం కౌటాలలోని సహకార సంఘం ఆఫీస్‌లో మాట్లాడుతూ ఇప్పటి వరకు సహకార సంఘం ఆధ్వర్యంలో కౌటాల మండలంలో కౌటాల, కుంబారి, చింతలమానేపల్లి మండలంలోని రవీంద్రనగర్, చింతలమానేపల్లి కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి వడ్లను ఎక్కువ మొత్తంలో కొనుగోలు చేయడం జరిగిందని తెలిపారు. మిగిలిన రైతులు తమ వడ్లను జనవరి 5 లోపు సెంటర్లకు తేవాలని కోరారు.

పని భారం ఎక్కువ..వేతనాలు తక్కువ

- ఆర్థిక ఇబ్బందుల్లో పంచాయతీ కార్మికులు
- హామీలను విస్మరించిన ప్రభుత్వం
- ఆదుకోవాలని వేడుకోలు





నవతెలంగాణ-వాంకిడి

గ్రామ పరిపాలనలో పంచాయతీ కార్మికుల పాత్ర ఎంతో కీలకం. ఏండ్లుగా పని చేస్తున్న గ్రామపంచాయతీ కార్మికుల బతుకులు అగమ్యగోచరంగా మారుతున్నాయి. పొద్దున్న లేచింది మొదలు రాత్రి పడుకునే వరకు పని చేసినా కనీస వేతనానికి కూడా నోచుకోక పస్తులుండాల్సిన పరిస్థితి ఉంది. ఏడాదంతా కష్టపడితే వచ్చే వేతనం ఆస్పత్రులకు కూడా సరిపోవడం లేదు. ప్రభుత్వాలు మారినా వేతనాల విషయంలో ఎటూ తేల్చడం లేదు. గంపడంత ఆశతో ఎదురు చూపులు తప్ప కనీస వేతనానికి నోచుకోవడం లేదు. చాలీచాలని వేతనాలతో పని భారం ఎక్కుగా ఉన్న పనిచేస్తూ తమ జీవితాలను గడుపుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు వీరిని పట్టించుకున్న దాఖలాలు లేవు. నెలనెల వేతనాలు రాక అప్పులు చేసి జీవనం కొనసాగిస్తూ పంచాయతీ కార్మికులు చాలీచాలని వేతనాలతో కాలం వెల్లదీస్తున్నారు.

పని ఎక్కువ.. వేతనాలు తక్కువ

గ్రామ పంచాయతీ కార్మికులకు నిత్యం గ్రామంలో పనుల భారం ఎక్కువగా ఉంటుంది. వేతనాలు మాత్రం తక్కువగా ఉన్నాయి. కార్మికులకు నెలకు రూ.9500 వేతనంతో పంచాయతీలో పనిచేస్తున్న ఉద్యోగభద్రత లేదు. కొత్త ప్రభుత్వం తమను ఆదుకోవాలని కారోబార్, పంచాయతీ కార్మికులు కోరుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 15 మండలాల పరిధిలో 335 గ్రామ పంచాయతీల్లో 1103 మంది దాదాపుగా 20 ఏండ్లకు పైగా కారోబార్‌లు, పంప్ ఆపరేటర్లు, ఎలక్ట్రీషన్లు, పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్నారు. ఆయా గ్రామాల్లో విద్యుత్ బల్బులు అమర్చడం, మంచినీరు విడుదల చేయడం, ఇంటి పన్నులు వసూలు చేయడం, మురుగు కాలువలను శుభ్రం చేయడం, ఎక్కడైన చెత్త దుర్గందం వస్తున్న, జంతువులు చనిపోయి కంపు కొడుతున్న తీసివేసే పనులు వీరు చేస్తున్నారు. కానీ ఇందుకు సరిపడా వేతనం మాత్రం అందుకోవడంలేదు. గ్రామాల్లో పన్నులు, బిల్లుల వసూలు ఆధారంగా నెలకు ప్రతి కార్మికుడికి రూ.9500 వేతనంగా చెల్లిస్తున్నారు. ఈ వేతనాలు కూడా కార్మికులకు నెలనెల కాకుండా మూడు నెలలకు ఒకసారి ఇస్తుండడంతో కార్మికులకు కుటుంబ పోషణ భారంగా మారుతుంది. ఇప్పటికైనా ప్రభుత్వం ఉద్యోగభద్రత కల్పిస్తుందనే ఆశతోనే వీరంతా విధులు నిర్వహిస్తున్నారు. విధులను ఒత్తిడితో చేస్తున్న ఉద్యోగభద్రత, కనీస వేతనాల కోసం నేరుగా ఉద్యమిస్తుందన్నారు. గ్రామాల్లో ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ఏ అధికారి పర్యటనకు వచ్చిన, మరే చిన్న పనికైనా వీరు తప్పకుండా ఉండాల్సిందే. పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా వేతనాలతో కుటుంబపోషణ ఎలా సాధ్యమని కార్మికులు వాపోతున్నారు. కొన్ని శాఖల్లో ఉదాహరణకు ఆశావర్కర్లు, హోంగార్డులు, ఇతర శాఖల సిబ్బందికి వేతనాలు పెంచుతున్న ప్రభుత్వం తమ గురించి పట్టించుకోకపోవడంపై కార్మికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. 20 ఏండ్ల నుండి గ్రామ పంచాయతీలో కార్మికులుగా పనిచేస్తున్న తమకు ఉద్యోగభద్రత కల్పిస్తూ వేతనాలు పెంచాలని గ్రామ పంచాయతీ కార్మికులు కోరుతున్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం గడిచిన తమను ఈ ప్రభుత్వమైనా ఉద్యోగభద్రత కల్పిస్తూ వేతనాలు పెంచాలని కార్మికులు వెయ్యి కండ్లతో ఎదురుచూస్తున్నారు.

హామీలు ఇచ్చారు అమలు మరిచారు...

గతంలో పంచాయతీ కార్మికులు రాష్ట్రవ్యాప్తంగా సమ్మె చేపట్టారు. ఊరూర సమ్మె కొనసాగడంతో పల్లెల్లో పారిశుధ్యం పడకెక్కింది. అప్పటి ప్రభుత్వం దశల వారీగా కార్మిక సంఘాల నేతలు, కార్మికులతో చర్చలు జరిపి సమస్యల పరిష్కారం కోసం కార్మికులు చనిపోయిన తర్వాత కార్మికుల దహన సంస్కరణలకు రూ.పది వేల నగదును గ్రామ పంచాయతీకి ఇవ్వాలని, రూ.ఐదు లక్షల బీమా వర్తింపచేయాలని, మరికొన్ని సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినా అవి హామీలుగానే మిగిలిపోయాయి. కొత్తగా వచ్చిన ఈ ప్రభుత్వమైనా తమ సమస్యలను పరిష్కరిస్తుందని ఆశగా ఎదురుచూస్తున్నారు. ఈ ప్రభుత్వమైన కార్మికులను ఆదుకుంటుందో లేక గత ప్రభుత్వాల మదిరి వదిలేస్తుందో చూడాలి.

ప్రయివేట్ ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో అనుమతులు లేకుండా పేద మధ్యతరగతి ప్రజల నుండి అడ్డగోలుగా దోపిడీ చేస్తున్న డయాగ్నొస్టిక్ సెంటర్లు, ప్రయివేట్ ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ, కేవీపీఎస్, సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా వైద్య శాఖ కార్యాలయం సూపరింటెండెంట్ షఫీకి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో విచ్చలవిడిగా డయాగ్నొస్టిక్స్ సెంటర్లు, ప్రయివేట్ ఆస్పత్రుల్లో ఎలాంటి ధరల పట్టిక లేకుండా ఇష్టానురాజ్యాంగ అమాయకమైన ప్రజల వద్ద నుండి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో అర్హతలు లేకుండా డాక్టర్లని నియమించుకొని రోగులకు వైద్యం చేస్తున్నారని తనిఖీలు నిర్వహించి పూర్తి విచారణ జరిపించాలన్నారు. డయాగ్నొస్టిక్ సెంటర్‌లో ధరల



పట్టిక లేకుండా అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని, ప్రజలపై ఆర్థిక భారం పడుతున్నదన్నారు. వీటిపై పూర్తి విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గేడం టికనంద్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు రాజేందర్, నాయకులు శ్రీకాంత్, డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ పొందిన కార్మికులకు సన్మానం



నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియా ఖైర్‌గూడ ఓపెన్ కాస్ట్‌లో ఉద్యోగ విరమణ పొందిన కార్మికులను సింగరేణి కాలనీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో సన్మానించారు. దీనికి ముఖ్య అతిథిగా ఫిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్ హాజరై విరమణ పొందుతున్న కార్మికులు కందుల కొమురయ్య(ఫోర్ మెన్), జంగపల్లి వెంకటి(ఎగ్జిక్యూటివ్ క్యారియర్), కటకం శంకర్(కన్వేర్ ఆపరేటర్), కొత్తపల్లి రామన్న(జనరల్ మజ్దూర్)లను శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిటైర్మెంట్ అనంతరం శేష జీవితం సుఖ సంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులు చాలా జాగ్రత్తగా చూసుకోవాలని తెలిపారు. ప్రతి కార్మికుడు తన కుటుంబ బాధ్యతలు పిల్లల భవిష్యత్తు కోసం అనునిత్యం కష్టపడి వారి పురోగతికి బాటలు వేస్తారని చెప్పారు. కార్యక్రమానికి ఏఐటీయూసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి శేషశైనా రావు, మీస చంద్రశేఖర్, దేవరకొండ దివాకర్, వర్క్‌మాన్ ఇన్స్‌పెక్టర్ నరిష్, ఖైర్‌గూడ సహాయ కార్యదర్శిమాల ఓదెలు, షిఫ్ట్ ఇన్‌చార్జి రాయిని రాజయ్య, ఎండీ షకీల్, ఎస్ నరేష్,అల్లాడి కోటి, వడ్డేపల్లి దిలీఫ్, తిరుపతి, దుర్గం ధర్మయ్య, కోడూరి రమేష్, పుప్పాల, సత్యనారాయణ,శ్రీకాంత్, కార్మికులు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కండ్లకు గంతలతో ఎస్ఎస్ఏ ఉద్యోగుల నిరసన

నవతెలంగాణ-ఆసిఫాబాద్

తమ సర్వీస్ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్ష ఉద్యోగులు కలెక్టరేట్ ఎదుట చేస్తున్న నిరసన దీక్ష 22వ రోజు కండ్లకు గంతలు కట్టుకొని కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షురాలు శృతికా మాట్లాడుతూ తమ సమ్మె 22వ రోజుకు చేరిన డిమాండ్‌లను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. సమ్మె ప్రభావంతో రాష్ట్రం అంతా విద్యా వ్యవస్థ రిపోర్టు, కేజీబీవీ అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులు బోధన అందటం లేదని, ఎమ్మార్సీలో ఏంఐఎస్‌లు, సీసీఓలు మెసెంజర్లు సమ్మెలో పాల్గొనడంతో రాష్ట్రం అంతటా ఎమ్మార్సీఈలు, సీఆర్పీలు మూతబడి ఉన్నాయన్నారు. వెంటనే ప్రభుత్వ పెద్దలు స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల జిల్లా ప్రధాన కార్యదర్శి తుకారం, సంఘం జిల్లా కోశాధికారి నగేష్, మీడియా ప్రతినిధి గేడేకార్ సంతోష్, దుర్గం సందీప్, అన్నపూర్ణ చైతన్య, కేజీబీవీ ప్రత్యేకాధికారి కవిత, ఎంఐఎస్ ప్రధాన కార్యదర్శి ప్రశాంత్, రాజేష్, రాజకుమార, సీసీఓ అధ్యక్షుడు అనూప్, సీఆర్పీ ప్రధాన కార్యదర్శి రాజేష్, వెంకటేష్, పీజీ సీఆర్టీలు అన్నపూర్ణ, స్వప్న, పీటీఐ అధ్యక్షుడు సత్యనారాయణ, రమేష్, ప్రకాష్, తిరుపతి, దేవేందర్, మహేష్, శివరాం, ప్రసన్న, స్వప్న, విజయ, బాబు, తిరుపతి, సుభాష్, సతీష్ పాల్గొన్నారు.



బెదిరింపులకు పాల్పడితే ఊరుకునేది లేదు

నవతెలంగాణ-బెజ్జూర్

కాగజ్‌నగర్ అటవీ డివిజన్ పరిధిలో అటవీశాఖ అధికారులు టైగర్ కారిడార్ పేరుతో బెదిరింపులకు పాల్పడితే ఊరుకునేది లేదని బీఆర్ఎస్ సిర్పూర్ కోఆర్డినేటర్ కొండ రాంప్రసాద్ హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కారిడార్ పేరుతో గ్రామాలను ఖాళీ చేసే ప్రయత్నం అటవీశాఖ అధికారులు చూస్తున్నారని ఆరోపించారు. అలా చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. టైగర్ కారిడార్ నిబంధనల ప్రకారం ఈ ప్రాంతంలో ఉన్న ప్రజలకు పునరావాసం కల్పించిన తర్వాతనే కారిడార్ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. రైతుల పక్షాన బీఆర్ఎస్ అండగా ఉంటుందన్నారు. కారిడార్ గురించి సిర్పూర్ ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు దుర్గం తిరుపతి, నాయకులు ఖాజా మొయినుద్దీన్, నీకాడి మోహన్, సిరాజ్, బాబురావు, శంషుద్దీన్ పాల్గొన్నారు.

యోగాతో అనేక లాభాలు



నవతెలంగాణ-కౌటాల

యోగాతో అనేక రకాల వ్యాధులను తగ్గించుకోవచ్చని యోగా గురువు దాసరి వినోద్ అన్నారు. ఆదివారం బెల్లంపల్లిలో నిర్వహించిన జాతీయ స్థాయి యోగ పోటీలలో కౌటాల మండలానికి చెందిన విద్యార్థులు ప్రథమ ద్వితీయ స్థానాలు సాధించారు. ప్రభుత్వ ఆయుష్ హెల్త్ వెల్నెస్ యోగ సెంటర్ గురుడుపేట్‌లో శిక్షణ పొందిన విద్యార్థిని విద్యార్థులు, బాలికల విభాగంలో ప్రథమ స్థానం దాసరి ధార్మిక, ద్వితీయ స్థానం నీకాడే యశ్విత, బాలుర విభాగం జూనియర్, సబ్ జూనియర్ బట్టి అఖిల్ సింగ్ ప్రథమ స్థానం, నమేవార్ నాగచైతన్య ప్రథమ స్థానం, ప్రతిభ కనబరిచి స్వర్ణ, రజత పథకాలను కైవసం చేస్తున్నారు. కాగా వీరిని మంగళవారం గురుడుపేట్ మాజీ సర్పంచ్ బ్రహ్మయ్య అభినందించారు. యోగ గురువు దాసరి వినోద్ మాట్లాడుతూ యువత నిత్య జీవితంలో యోగాను అలవర్చుకుంటే చెడు మార్గంలో వెళ్లకుండా నవ సమాజ నిర్మాణానికి తోడు అవుతారన్నారు. కార్యక్రమంలో యోగా సభ్యులు మల్లా గౌడ్, సంతోష్, ఆనంద్, సాయిరాం, ఉదయ్, మహిళ యోగా శిక్షకులు రోజా, శివకృష్ణ, తిరుపతి పాల్గొన్నారు.

కళాశాలలో విద్యార్థులకు ముగ్గుల పోటీలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని ముదిగంటి సూర్యమ్మ బీఈడీ కళాశాలలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ముందస్తుగా విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులకు సంస్కృతి సాంప్రదాయాలు వాటి విలువలను తెలిసే ఉద్దేశంతో ముగ్గుల పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. పోటీలలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారని వివరించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది శంకర్, ఆనంద్, సుజాత, స్రవంతి, వెంకట్, విద్యార్థులు పాల్గొన్నారు.

పేకాట స్థావరం పై పోలీసుల దాడి

నవతెలంగాణ-బెజ్జూర్

పేకాట స్థావరంపై సోమవారం రాత్రి బెజ్జూర్ ఎస్సై ఆధ్వర్యంలో పోలీసులు దాడి నిర్వహించారు. ఎస్సై ప్రవీణ్ తెలిపిన వివరాల ప్రకారం.. పక్క సమాచారం మేరకు మండలంలోని చిన్న సిద్దాపూర్ గ్రామ సమీపంలో పేకాట ఆడుతుండగా దాడి నిర్వహించారు. ఇక్కడ ఎనిమిది మందిని పట్టుకొని కేసు నమోదు చేసి వీరి వద్ద నుండి రూ.6400 నగదు, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై తెలిపారు. పేకాట ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రైతు వేదికలో చోరీ

నవతెలంగాణ-బెజ్జూర్



మండలంలోని వుట్ సారంగపల్లి రైతు వేదికలో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్టు ఐకేపీ సీసీ తిరుపతి, తహసీల్దార్ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ రైతు వేదికలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. 507 గన్ని బ్యాగులు ఉండగా 127 బ్యాగులను గుర్తు తెలియని వ్యక్తులు తలుపులను పగులగొట్టి దొంగిలించినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. చోరీకి పాల్పడిన వ్యక్తులపై కఠినంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

యువకులు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి చేయాలి



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

యువకులు క్రీడాలతో పాటు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి చేయాలని గోండ్వానా కోయ ఆదివాసీ సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి తలండి మధుకర్, బండి మహేష్ అన్నారు. భీమాకోరెగావ్ విజయ్ దివాస్ సందర్భంగా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు కోట సతీష్, కార్యదర్శి తలండి భాస్కర్ ఆధ్వర్యంలో జరిగిన వాలిబాల్ టోర్నీ ముగింపులో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మొదటి బహుమతి మంచిర్యాల జిల్లా మల్లంపేట జట్టు, రెండవ బహుమతి పెంచికల్‌పేట్ మండలం జిల్లేడ జట్టు, మూడవ బహుమతి మొర్లిగూడ జట్టు గెలుపొందాగా బహుమతులను అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ భీమాకోరెగావ్ పోరాట యోధుల స్ఫూర్తితో యువకులు విద్యార్థులు ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ సామాజిక అవగాహన పెంపొందించుకోవాలని, ప్రతి గ్రామంలో కోరేగవ్ విజయ దివస్ ఉత్సవాలు జరుపుకోవాలన్నారు. ఈ టోర్నమెంట్ నిర్వాహణకు సహకరించిన డా.ఆర్‌యస్ ప్రవీణ్ కుమార్, బిట్టి శ్రీనివాస్, మహేష్, కశిపాక రాజు, వెంకటేష్, ఎదిగం హన్మంతులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సాయి, సుబ్బారావు, వెంకటేష్, సాగర్, లక్ష్మణ్, తిరుపతి, విజయ్, కరణ్, యోగేష్, ఆయా గ్రామాల యువకులతో పాటు వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

తూము పరిశీలించిన అధికారులు

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని సింగరాయపేట చెరువులోకి నీరు వెళ్లడానికి కాల్వకు అక్రమంగా పెద్ద తూము పెట్టారని తిమ్మాపూర్ మాజీ సర్పంచ్ జాడి గంగాధర్ సోమవారం మంచిర్యాల జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ స్పందించి రెవెన్యూ అధికారులను కాల్వ తూమును పరిశీలించాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో మండల రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ గంగరాజు, నీటిపారుదల అధికారులు మంగళవారం తూమును పరిశీలించారు. త్వరలో తూమును తీయించి చిన్నది బిగిస్తామని ఆర్ఐ గంగరాజు తెలిపారు. కార్యక్రమంలో నీటిపారుదల జేఈ, సూపర్‌వైజర్ మామిడి శంకర్ పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

నవతెలంగాణ-హాజీపూర్



మండలంలోని కొలం గూడలో మంగళవారం హాజీపూర్ తహసీల్దార్ శ్రీనివాస్ దేశ్పండే చేతుల మీదుగా దుప్పట్లు పంపిణీ చేశారు. దాతలు, యువరాజ్యం స్వచ్ఛంధ సంస్థ ఆద్వర్యంలో సేకరించిన విరాళాలతో 20 మంది పేద గిరిజన కుటుంబాలకు 40 దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పద్మ ముని, స్వచ్ఛంధ సంస్థ సభ్యులు గొర్రె లక్ష్మణ్, మధుసూదన్, సీనియర్ జర్నలిస్టు వంశీ, మాజీ ఎంపీపీ కోఆప్షన్ రఫీక్ పాల్గొన్నారు.

పంచాయతీల ప్రగతిపై దృష్టి సారించాలి



నవతెలంగాణ-తాండూర్

ఇందిరమ్మ ఇండ్ల సర్వే పనులు పూర్తిచేసిన పంచాయితీ కార్యదర్శులు పంచాయితీ ప్రగతి పనులపై దృష్టి సారించాలని జిల్లా పంచాయతి అధికారి డి వెంకటేశ్వర్ రావు సూచించారు. మంగళవారం తాండూర్ గ్రామ పంచాయతిని ఆకస్మిక తనిఖీ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్లను సర్వేను త్వరగా పూర్తిచేయాలని తెలిపారు. గ్రామపంచాయతీలలో వార్షిక గ్రామసభలు నిర్వహించాలని తెలిపారు. ప్రతి పంచాయతీలలో ఇంటి పన్నుల పూర్తిస్థాయిలో వసూలు చేయాలని ఆదేశించారు. తాండూర్ పంచాయతీ రికార్డులను పరిశీలించిన పంచాయతి కార్యదర్శి దివాకర్‌కు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతి ప్రత్యేక అధికారి ఎంపీడీఓ పి శ్రీనివాస్, మండల పంచాయతి అధికారి జి అనిల్ కుమార్ పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలను ఆపాలి



నవతెలంగాణ-జన్నారం

మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వెనకాల సర్వే నెం.374లో కొంతమంది ప్రభుత్వ భూమిని అబ్జా చేసుకున్నారని, అక్కడ చేపడుతున్న అక్రమ నిర్మాణాలను వెంటనే నిలిపి వేయాలని అంబేద్కర్ సంఘం మండల నాయకుడు ముల్కల ప్రభాకర్ అన్నారు. మంగళవారం అంబేద్కర్ సంఘ నాయకులతో కలిసి వెళ్లి తహసీల్దార్ కార్యాలయంలో, డిప్యూటీ తహసీల్దార్ రామ్మోహన్ రావుకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తహసీల్దార్ కార్యాలయం వెనుక ఉన్న సర్వే నెం 374లో పూర్తి విస్తీర్ణం 5 ఎకరాల 8 గుంటల భూమి ఉండేది అన్నారు. కానీ కొంతమంది కబ్జాదారులు ప్రభుత్వ భూమిని కబ్జా చేసుకుని అనుభవిస్తున్నారన్నారు. అదే కాక సోమవారం రాత్రి ఆ భూమిలో అక్రమంగా నిర్మాణాలు చేపట్టడానికి కొందరు వ్యక్తులు పూనుకున్నారన్నారు. ఆక్రమ తవ్వకాలను ఆపి, ప్రభుత్వ భూమి కబ్జా కాకుండా చూడాలన్నారు. లేకుంటే అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామన్నారు. దీనిపై కలెక్టర్, ఆర్డీవో తెలంగాణ రాష్ట్ర హైడ్రా కమిషన్‌కు వినతి పత్రం అందిస్తామన్నారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం నాయకులు కోడి హరీష్, కొప్పుల రాము, మునగాల వెంకటేష్, దాసన్ల నవీన్, బొట్ల సంజీవ్, కండ్లెస్ శ్రావణ్, మునగాల అజయ్, శరత్ ఇందూరు ప్రభాకర్ పాల్గొన్నారు.

ఘనంగా పౌర హక్కుల దినోత్సవం

నవతెలంగాణ-తాండూర్

మండలంలోని తాండూర్ గ్రామపంచాయతీలో మంగళవారం ఆర్ఐ అంజన్ కుమార్ పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రజలు కలిసిమెలిసి సోదరా భావంతో ఉండాలని తెలిపారు. ప్రభుత్వం దృష్టిలో ప్రజలంతా సమానమేనని సామాజిక ఆస్తుల్లో అందరికీ సమాన హక్కులు ఉంటాయని తెలిపారు. ప్రజల్లో ఐకమత్యాన్ని పెంపొందించడానికి పౌరహక్కుల దినోత్సవం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దివాకర్ పీసీ తిరుపతి గ్రామపంచాయతీ ప్రజలు పాల్గొన్నారు.

3న బహిరంగ విచారణ

నవతెలంగాణ-నస్పూర్

షెడ్యూల్డ్ కులముల ఉప వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమీషన్ ప్రతినిధి, తెలంగాణ రాష్ట్ర హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి డా.జస్టిస్ షమీమ్ అక్తర్ ఆధ్వర్యంలో ఈ నెల 3న ఆదిలాబాద్ కలెక్టర్ కార్యాలయంలో బహిరంగ విచారణ నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కుమ్రంభీం ఆసిఫాబాద్ ప్రజల అభిప్రాయాలను బహిరంగ విచారణలో స్వీకరించడం జరుగుతుందని, ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు జరుగనున్న బహిరంగ విచారణలో జిల్లాలోని అన్ని ఎస్సీ కులాల సంఘాల ప్రతినిధులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై తమ అమూల్యమైన అభిప్రాయాలు, వినతులు సమర్పించవచ్చని తెలిపారు.

పైడిపల్లి బీట్ ఆఫీసర్ తన్వీర్ పాషా సస్పెండ్

నవతెలంగాణ-జన్నారం

జన్నారం అటవీ రేంజి పరిధిలోని పైడిపల్లి బీట్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న తన్వీర్ పాషాను సస్పెండ్ చేసినట్లు, జన్నారం ఇన్‌చార్జి ఎఫ్ఆర్ఓ సుష్మారావు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తన్వీర్ పాషా విధుల్లో నిర్లక్ష్యం వహించడం వల్ల అతన్ని సస్పెండ్ చేయడం జరిగిందన్నారు. అటవీ అధికారులు ఎవరైనా విధుల్లో నిర్లక్ష్యం వహించిన, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అటవీ అధికారులు సక్రమంగా తమ విధులు చేసుకోవాలని సూచించారు.

పింఛన్ చెల్లింపు బాధ్యత యాజమాన్యానిదే

నవతెలంగాణ-జైపూర్

బొగ్గు గని కార్మికులు, ఉద్యోగులకు సంబందించిన పింఛన్ చెల్లింపు బాధ్యత సదరు యాజమాన్యాలదేనని కోలిండియా ఉన్నత స్థాయి అధికారుల సమావేశంలో వెల్లడించింది. ఇందుకు అవసరమైన నిధిని కోలిండియా, సింగరేణి, బొగ్గు సంస్థలు విరాళాలతో సమకూర్చనున్నాయని ఇటీవల కోలిండియా ప్రధాన కార్యాలయంలో ఉన్నత స్థాయి సమావేశంలో నిర్ణయించారు.. బొగ్గు మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి రూపిందర్ బ్రార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పింఛన్ కోతకు ఏ మాత్రం అవకాశం ఉండదని అంగీకారించారు. సీఎంపీఎఫ్ కమీషనర్ విజయ్ కుమార్ మిశ్రా, కోల్ ఇండియా డైరెక్టర్ పర్సనల్ వినయ్ రంజన్, కోలిండియా డైరెక్టర్ ఫైనాన్స్ ముఖేష్ అగర్వాల్, ఈపీఎఫ్ఓ అడిషనల్ కమీషనర్ అపరాజిత జగ్గీ, సింగరేణి కోల్ కంపెనీ డైరెక్టర్, ఏఐటీయూసీ నుంచి రామేంద్ర కుమార్, సీఐటీయూ నుంచి రామానంద్ తదితరులు పాల్గొన్న సమావేశంలో నిర్ణయించారు. ఇదిలావుండగా సీఎంపీఫ్ సంస్థ, కోలిండియా సమావేశంలో వెల్లడించిన గణాంకాలలో వ్యత్యాసం కారణంగా సీఎంపీఎఫ్, కోలిండియా డైరెక్టర్ ఫైనాన్స్ గణాకాంకాలను సరిదిద్దాలని నిర్ణయించుకున్నారు. తదుపరి కమిటీ సమావేశం జనవరి మొదటి వారంలో ఏర్పాటు చేసి అనంతరం నివేదికను సీఎంపీఎఫ్ ట్రస్టీల బోర్డుకు సిఫారస్ చేయాలని నిర్ణయించారు.

శభాష్ షెట్‌పల్లి సర్పంచ్

- గ్రామ అభివృద్ధికి నిస్వార్థ సేవలు
- జనరల్ స్థానంలో ఎస్సీ అభ్యర్థిగా ఎన్నిక
- మరోసారి అవకాశం ఇస్తామంటున్న ప్రజలు

నవతెలంగాణ-జైపూర్

తమ గ్రామానికి ఏదో చేయాలనే సంకల్పంతో ప్రజా సేవచేసేందుకు ముందుకు వచ్చిన షెట్‌పల్లి మాజీ సర్పంచ్ మేడి రవి చేపట్టిన కార్యక్రమాలు శభాష్ అనిపిస్తున్నాయి. 2004 టీడీపీ నుంచి ఎంపీటీసీగా గెలుపొంది గ్రామానికి సేవలందిచాడు. గ్రమ ప్రజల ఆకాంక్ష మేరకు ఎస్సీ సామాజీక వర్గానికి చెందిన రవి జనరల్ స్థానంలో సర్పంచ్‌గా పోటీ చేసి గెలుపొందాడు. ప్రజల నిర్ణయానికి అనుగుణంగా గ్రామంలో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ముందుకు సాగాడు. తన పదవీ కాలంలోనే గ్రామంలో మౌళిక సదుపాయాలు కల్పించాలనే లక్ష్యంతో పనిచేశారు.





రాభోవు కాలంలో ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా షాశ్వత పరిష్కార మార్గాలు చూపి ప్రజల మన్ననలు పొందాడు. ఐదు సంత్సరాల పదవీ కాలంలో రెండేండ్లు కరోనా కష్టాలను అధిగమించి షెట్‌పల్లి గ్రామాన్ని అన్ని విదాలా అభివృద్ధి పరిచారు.

ఆధ్యాత్మిక మార్గం..

గ్రామంలో శాంతిని నెలకొల్పడానికి ప్రజలను ఐక్య మత్యంతో మెదలడానికి తనవంతు కృషి చేశారు. అది సాధ్యం కావాలంటే గ్రామంలో ఆధ్యాత్మిక మార్గం ద్వారానే సాధ్యమని భావించాడు. గ్రామంలో రామాలయ అభివృద్ధికి కృషి చేశారు. ఆలయ నిర్మాణానికి తనవంతు సహకారం అందించి రూ.6 లక్షలతో ఆయానికి ప్రహారి నిర్మించి భక్తుల మన్ననలు అందుకున్నాడు. రూ.1.50 లక్షలతో షెడ్ ఏర్పాటు చేశారు.






గ్రామంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు

గ్రామస్థులతో పాటు ఇతర ప్రాంతా నుండి వచ్చే భక్తుల సౌకర్యార్థం గోదావరి నది ఒడ్డున మెట్లు నిర్మించడమే కాకుండా గోదావరి రోడ్డులో పంప్ హౌజ్ సమీపంలో సింగరేణి నిధులు రూ.24 లక్షలతో పిల్లకాలు పై వంతెన నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. రూ. 18 లక్షలతో కట్టుకాలువ రోడ్డు నిర్మాణం చేపట్టారు. రూ. 15 లక్షలతో బాటల్ రోడ్డు ఫార్మేషన్‌తో పాటు మెటల్ నిర్మాం చేపట్టారు. అదే విదంగా ఆయన చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు ఈ విదంగా ఉన్నాయి.

- రూ. 6 లక్షల స్వంత ఖర్చులతో రామాలయం అభివృద్ధి ప్రహరి గోడ నిర్మాణం పరిసరాల అభివృద్ధి.
- రూ. 1.50 వేల స్వంత డబ్బులతో ఆంజనేయ స్వామి ఆలయంలో భక్తు సౌకర్యార్థం షెడ్ నిర్మాణం.
- షెట్‌పల్లి కమాన్ నుండి బద్దిపోచమ్మ ఆలయం వరకు స్వంత ఖర్చులతో విద్యుత్ లైన్ ఏర్పాటు.
- గ్రామంలో స్వంత ఖర్చులతో తెలంగాణ తల్లి, అంబేద్కర్ విగ్రహాల ఏర్పాటు
- గ్రామ పంచాయతీ నిధులు రూ. 4 లక్షలు రూ. 22 లక్షల డీఫ్ నిధులు ఖర్చు చేసి బీరన్న దేవాలయం వరకు రోడ్డు అభివృద్ధి, విద్యుత్ స్థంబాల ఏర్పాటు.
- స్వంత ఖర్చులతో గ్రామ పంచాయతీ సిబ్బందికి రూ. 20 లక్షల వ్యక్తిగ భీమా సౌకర్యం
- బెస్తవాడ, మన్నెపు వాడలకు విద్యుత్ లైన్ ఏర్పాటు.
- గ్రామ పంచాయతీల పరిధిలో సీసీ కెమెరాల ఏర్పాటు.
- రూ. 15 లక్షలతో బాటల్ రోడ్డు ఫార్మెషన్‌తో పాటు బీటీ రోడ్డు నిర్మాణం.
- రూ. 18 లక్షలతో కట్టు కాలువ రోడ్డు నిర్మాణం.
- షెట్‌పల్లి శివారు నుంచి బెజ్జాల పంచాయతీ శివారు వరకు స్వంత ఖర్చుతో విద్యుత్ లైన్ ఏర్పాటు.
- ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి రూ.22 లక్షల నిధుల మంజూరికి కృషి
- సమ్మక్క సారక్క మహిళా భవన నిర్మాణం కోసం రూ.18 లక్షల నిధుల మంజూరికి కృషి
- వార్డుల వారిగా ప్రతి ఇంటికి నీటి సరఫరా.. సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం.

ఇసుక అక్రమ రవాణా అరికట్టేందుకు చర్యలు

నవతెలంగాణ-నస్పూర్



జిల్లాలో ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం కలెక్టర్ చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలో ఇసుక అక్రమ రవాణా నియంత్రణపై కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇప్పటి వరకు ఇసుక డంప్ నుండి మాత్రమే ఇసుక తీయడం జరుగుతుందని, ఈ డంప్ సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉంటుందని, చెక్‌పోస్టుల ద్వారా తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ సంవత్సరం చింతపల్లి వేబ్రిడ్జ్ నుండి 328 ట్రిప్పులలో 1 వేయి 312 మెట్రిక్ టన్నుల ఇసుకను రూ.47 వేల 468కు విక్రయించడం జరిగిందని, కొల్లూర్ వద్ద ఉన్న 3 వేబ్రిడ్జ నుండి 78 ట్రిప్పులలో సుమారు 2 వేల 340 మెట్రిక్ టన్నుల ఇసుకను రూ.8 లక్షల 77 వేల 500కు విక్రయించడం జరిగిందదని తెలిపారు. ఒక ట్రిపులో దాదాపు 30 మెట్రిక్ టన్నుల ఇసుక ఉంటుందని, అంతకు మించి ఉన్నట్లయితే అన్లోడింగ్ చేయడం జరుగుతుందని, ఒక కిలో ఇసుక కూడా నిబంధనలకు మించి లోడింగ్ చేయడం జరుగలేదని తెలిపారు. ఓవర్ లోడ్‌లో ఇసుక తరలిస్తున్న అంశంలో 2023 సంవత్సరంలో 32 కేసులు నమోదు చేసి రూ.10 లక్షల 77 వేల 120, 2024 సంవత్సరంలో 4 కేసులు నమోదు చేసి రూ.2 లక్షల 12 వేల 360 జరిమానా రుసుము వసూలు చేయడం జరిగిందని తెలిపారు. ఒక లారీ పట్టుబడినట్లయితే రూ. లక్ష, ట్రాక్టర్ అయితే రూ.25 వేలు జరిమానా విధిస్తామని తెలిపారు. 2023 సంవత్సరంలో 139 ట్రిప్పులలో తరలిస్తున్న 556 మెట్రిక్ టన్నుల ఇసుకను సీజ్ చేసి రూ.16 వేల 680, 2024 సంవత్సరంలో 686 ట్రిప్పులలో తరలిస్తున్న 2 వేల 744 మెట్రిక్ టన్నుల ఇసుకను సీజ్ చేసి రూ.74 వేల 88 జరిమానా వసూలు చేయడం జరిగిందని తెలిపారు. ఇసుక డంప్, తరలింపు, వివరాల నమోదు వంటి అన్ని అంశాలు పారదర్శకంగా జరుగుతున్నాయని, ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులకు ఇసుకను నిబంధనలకు లోబడి తరలించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని హాజీపూర్ మండలం ముల్కల్ల, చెన్నూర్ మడలం అక్కెపల్లి, నెన్నెల మండలం ఖర్జి ప్రాంతాలలో ఏర్పాటు చేసిన ఇసుక రీచ్ల ద్వారా జిల్లాలోని స్థానిక అవసరాలకు ఇసుకను వినియోగించడం జరుగుతుందని తెలిపారు. వార్త పత్రికలు, న్యూస్ ఛానళ్లలో ఇసుక అక్రమ రవాణాపై వివిధ కోణాలలో వార్తలు వస్తున్నాయని, ఒక్కసారి ప్రజలలోకి వెళ్లిన వార్తను తిరిగి తీసుకోలేమని, పాత్రికేయులు బాధ్యతగా వ్యవహరించి ఈ అంశంపై నిజ నిర్ధారణ చేసుకొని, పూర్తి ఆధారాలతో వార్తలు ప్రచురించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు

ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలి

- బావురావుపేట్ గుడిసెవాసుల నిరసనకు మద్దతు తెలిపిన రజక సంఘం



నవతెలంగాణ-జైపూర్

రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి డిమాండ్ చేశారు. చెన్నూర్ మండలం బావురావుపేట్ శివారు ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుసుకున్న పేదలకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మంగళవారం గుడిసె వాసులతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు. సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో గుడిసెవాసులు చేపట్టిన నిరసన కార్యక్రమానికి రజక కుల సంఘం మద్దతు తెలుపుతూ నిరుపేదలైన గుడిసె వాసులకు ప్రభుత్వ పట్టాలు పంపిణీ చేయాలని కోరారు. బావురావుపేట్ శివారు సర్వే 8లో నిరుపేదలైన వారు గుడిసెలు వేసుకోగా గుడిసెవాసుల సౌకర్యార్థం కనీస మౌళిక వసతులు కల్పించాలని రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి పాయిరాల రాములు డిమాండ్ చేశారు. ఈ సంధర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి మాట్లాడుతూ పేద ప్రజలకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వడంతో పాటు ఇంటి స్థలం లేనటువంటి వాళ్లకు ఇంటి స్థలం ఇవ్వనున్నట్లు ప్రభుత్వం ప్రకటించిందని గుర్తు చేశారు. అదేవిదంగా ఇంటి స్థలం లేనటువంటి వారికి ఇంటి స్థలం కోసం రూ.15 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం సానుకూలంగా స్పందించకుంటే రాబోవు రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) ఏరియా కార్యదర్శి బోడంకి చందు, నాయకులు శ్యామల, ఉమారాణి, రాజేశ్వరి, రమాదేవి, రేణుక, యామిని, కుమార్, పోషం, సహనబేగం, వెంకటస్వామి, శ్రీనివాస్, సంధ్య పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ పొందిన వారికి ఘన సన్మానం



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్ఆర్పీ-3, 3ఏ, ఆర్కే-7 గనిలో సుదీర్ఘకాలం పాటు పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులను మంగళవారం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డిప్యూటీ జనరల్ సెక్రెటరీ వీరభద్రయ్య మాట్లాడుతూ సింగరేణి సంస్థలో వివిధ కేటగిరీలో 30 నుండి 40 సంవత్సరాల సర్వీసులో విధులు నిర్వహించి సింగరేణి సంస్థకు వారు చేసిన సేవలు మరువలేనివి అని కొనియాడారు. పదవీ విరమణ తర్వాత జీవితాన్ని సంతోషంగా గడపాలని ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షచారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ కొట్టే కిషన్ రావు, ఎస్ఆర్పీ-3 ఫీట్ సెక్రెటరీ మురళీ చౌదరి, ఉపాధ్యక్షుడు తవటం మల్లేష్, అసిస్టెంట్ ఫీట్ సెక్రటరీ అంబాల రవి, సోషల్ మీడియా ఇన్‌చార్జి ఆడెపు సురేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కాసిపేట విక్కీ, జీఎం కమిటీ మెంబర్ చంద్రశేఖర్, మైనింగ్ స్టాఫ్ ఏరియా నాయకుడు రాజేందర్, బ్రాంచ్ మీడియా ప్రతినిధి రాజ్ కుమార్, అసిస్టెంట్ పిట్ సెక్రటరీ సదానందం, అనిల్, యాదగిరి, చిలక రమేష్, అఖిల్, శంకర్, ప్రసాద్ రావు పాల్గొన్నారు.

అక్రమంగా వేసిన గుడిసెలను తొలగించిన అటవీ అధికారులు



నవతెలంగాణ-జన్నారం

తాళ్లపేట రేంజ్‌లోని తపాలపూర్ గ్రామ సమీపాన ఉన్న అటవీ భూములలో కొంతమంది అక్రమంగా గుడిసెలు వేయగా వాటిని తొలగించినట్టు తాళ్లపేట ఎఫ్ఆర్ఓ సుష్మారావు తెలిపారు. అటవీ భూములలో కొంతమంది అక్రమంగా గుడిసెలు వేస్తున్నారని సమాచారం తెలుసుకున్న ఎఫ్ఎస్ఓ నహీదా పర్వీన్ ఎఫ్బిఓ లక్ష్మీపతి సంఘటన స్థలానికి వెళ్లి, ఆ గుడిసెలను తీసివేయాలని వారిని కోరారు. అయినా వారు ససేమీరా వినకపోవడంతో గుడిసెలను తొలగించే సందర్భంలో వారికి అటవీ అధికారులకు చిన్న ఘర్షణ చోటు చేసుకుందన్నారు. అయినప్పటికీ ఎఫ్ఎస్ఓ, ఎఫ్బీఓలు ఆ గుడిసెలను తొలగించారు. ప్రభుత్వ అటవీ భూములలో ఎవరైనా అక్రమంగా ఆక్రమిస్తే గుడిసెలు వేసిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వ్యవసాయ కూలీలతో నూతన సంవత్సర వేడుకలు



నవతెలంగాణ-హజీపూర్

మంచిర్యాల పీఏసీఎస్ చైర్మన్ సందేల వెంకటేష్ తన వ్యవసాయ క్షేత్రంలో మంగళవారం ముందస్తు నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు.వేంపల్లి లోని తనకున్న 7 ఎకరాల విస్తీర్ణం లో వివిధ రకాల కూరగాయల పంటలు సాగుచేస్తుంటారు.15 మంది వరకు కూలీలు నిత్యం వ్యవసాయ క్షేత్రంలో పనులు చేస్తూ ఉపాది పొందుతుంటారు.కేక్ కోసి వేడుకలు ఘనంగా నిర్వహించారు.కూలీలకు స్వీట్లు పంపిన చేశారు.

3 నుంచి శ్రీశ్రీ లోవ భీమయ్యక్ వార్షిక మహోత్సవం

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని పెద్దాపూర్‌లో ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు ఆదివాసుల ఆరాధ్య దైవం శ్రీశ్రీ లోవ భీమయ్యక్ ఆలయ వార్షిక మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని దేవాపూర్‌లో శ్రీశ్రీ లోవ భీమయ్యక్ వార్షిక మహోత్సవానికి సంబంధించిన కరపత్రాలను ఆయా సంఘాల నాయకుల చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ మహోత్సవానికి తరలివచ్చి పూజా కార్యక్రమాల్లో పాల్గొని ఉత్సవాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మడావి అనంతరావు, భారతాని సతీశ్, ఆడె జంగు, శ్రీశ్రీ లోని భీమయ్యక్ ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు ఆత్రం మహేశ్, అధ్యక్షుడు ఆత్రం భీంరావు, ప్రధాన కార్యదర్శి ఏ భీంరావు, ఉపాధ్యాక్షుడు ఆత్రం గంగారాం, ఆత్రం భీము, కోశాధికారి ఆత్రం మహదు పాల్గొన్నారు.



జూనియర్ అసిస్టెంట్‌లకు పోస్టింగ్ ఆర్డర్స్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



టీజీపీఎస్సీ నిర్వహించిన పరీక్షా రాసి జూనియర్ అసిస్టెంట్‌గా ఎంపికైన 18 మంది అభ్యర్థులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. కాగా మంగళవారం రెవెన్యూ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా వారికి కలెక్టర్ రాజర్షి షా తన కార్యాలయంలో పోస్టింగ్ ఆర్డర్స్ కాపీలను అందజేశారు. అనంతరం వారికి శుభాకాంక్షలు తెలిపారు. విధులను అంకితభావంతో నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, కలెక్టరేట్ పరిపాలనాధికారి బి.రాంరెడ్డి, సిబ్బంది శ్రీధర్, సౌజన్య, అభ్యర్థులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న కార్మికులు

నవతెలంగాణ-రెబ్బెన



సింగరేణి ఖైరగూడ ఓపెనకాస్ట్‌లో కాంట్రాక్టు కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్న జైవంతరావు అనారోగ్యానికి గురై పక్షవాతంతో ఇంట్లో ఉంటున్నాడు. విషయం తెలుసుకున్న తోటి కార్మికులు మానవత్వంతో హాస్పిటల్ ఖర్చుల నిమిత్తం రూ.26000 సాయం అందించారు. ఇంజనీర్లు, ఫిట్టర్లు, ఫోర్ మెన్, సూపర్‌వైజర్, జనరల్ మజ్దూర్లు, సీహెచ్‌పీ బెల్ట్ క్లీనింగ్ కార్మికులు తమ వంతుగా ఆర్థిక సాయం చేసి మానవత్వం చాటుకున్నారు.

మహాయాగంలో పాల్గొన్న శ్రీకాంత్‌రెడ్డి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని డైట్ కళాశాల మైదానంలో జరుగుతున్న శ్రీ కృష్ణ కాలచక్రం అతిరుద్రం విశ్వశాంతి మహా యాగంలో తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి మంగళవారం పాల్గొన్నారు. యాగం నిర్వహిస్తున్న స్వామీజీ కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామిని కలిసి వారి దివ్య ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం అక్కడ నిర్వహిస్తున్న యాగశాల, యజ్ఞశాల, గోశాల, కల్యాణ మండపాన్ని దర్శించుకుని పూజలు చేసారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ ఏంతో మహిమన్వితమైన ఇంతటి గొప్ప యాగం ఆదిలాబాద్ లో జరగడం ఇక్కడి ప్రజల అదృష్టమని అన్నారు. ప్రతీ రోజు ఎన్నో పూజది కార్యక్రమాలు, దేవతల కల్యాణలు జరిపిస్తున్న స్వామి కృష్ణ చైత్యన్య స్వామి వారి సంకల్పం ఏంతో గొప్పదని అన్నారు. నిత్యం వేలాది భక్తులు పూజది కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని, ఇంతటి విశిష్టమైన యాగం లో ప్రతీ ఒక్కరు పాల్గొని తరించాలని కోరారు.

టీజేఏ క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-నార్నూర్

ట్రైబల్ జర్నలిస్ట్ అసోసియేషన్(టీజేఏ) క్యాలెండర్‌ను మంగళవారం మండల కేంద్రంలో మాజీ సర్పంచుల సంఘం రాష్ట కార్యదర్శి బానోత్ గజానంద్ నాయక్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో విలేకరులు రాథోడ్ సంతోష్, రాము, ఇందల్, ఝాడే తిరుపతి, కేశవ్ ఉన్నారు.

రేపు హుండీ లెక్కింపు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ మండలంలోని ఈజ్‌గాంలో గల శివమల్లన్న స్వామి దేవాలయ హుండి లెక్కింపును గురువారం చేపడుతున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 11 గంటలకు హుండి లెక్కింపు ఉంటుందని, ఆసక్తి గల భక్తులు సేవలందించేందుకు హాజరు కావాలని కోరారు.

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన ఎంపీడీఓ

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని నీలా జిల్లా పరిషత్ పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు వండిన మధ్యాహ్న భోజనాన్ని ఎంపీడీవో వెంకటేష్ యాదవ్, సూపరింటెండెంట్ హెచ్.శ్రీనివాసులు పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికులకు ఆదేశించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు వంట పాత్రలు శుభ్రంగా ఉంచుకోవాలని వారు సూచించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇల్తెపు శంకర్, ఉపాధ్యాయులు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్‌పి పోస్టర్ల ఆవిష్కరణ

నవతెలంగాణ-రెంజల్

అఖిలభారత ఐక్య రైతు సంఘంను చట్టబద్ధత కల్పించాలని, ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు రోజుకు 600 రూపాయలు, 200 రోజుల పని దినాలను కల్పించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత ఐక్య రైతు సంఘం నాయకులు పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు. మండలంలోని బోర్గం గ్రామంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సన్న చిన్న కారు రైతులకు ఇలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని, సామాజిక ఆర్థిక, రాజకీయ న్యాయం అమలు చేయాలని, పోడు సాగుదారులందరికీ పట్టాలు ఇవ్వాలని, నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అఖిల భారత రైతు ఐక్య సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్ముల గంగాధర్, ఉపాధ్యక్షులు పుట్టి నడిపి నాగన్న, మండల అధ్యక్షులు పెద్దులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పార్వతి రాజేశ్వర్, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్కె నసీర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వడ్డెన్న, సిద్ధప్ప, సిద్ధ పోశెట్టి, జబ్బర్, సుదర్శన్ గౌడ్, మైసయ్య తరుణ్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

బీసీ రాజ్యాధికార సమితి కామారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా కుమ్మరి యాదగిరి

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని బీసీ సంఘం జిల్లా కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన బీసీ నాయకుల సమావేశంలో బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర నాయకులు కాముని సుదర్శన్ నేత ఆధ్వర్యంలో బీసీ రాజ్యాధికార సమితి కామారెడ్డి జిల్లా నూతన అధ్యక్షుడి ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు కాముని సుదర్శన్ నేత మాట్లాడుతూ బీసీ రాజ్యాధికార సమితి కామారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా పిట్లంకు చెందిన కుమ్మరి యాదగిరిని నియమించినట్టు తెలిపారు. అనంతరం యాదగిరి మాట్లాడుతూ తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్షుడిగా ఎన్నుకున్న రాష్ట్ర నాయకులు కాముని సుదర్శన్ నేతకు, ఇతర రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి నాయకులకు కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. అందరికీ అందుబాటులో ఉంటూ జిల్లాలో సంఘం అభివృద్ధికై కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర నాయకులు కాముని సుదర్శన్ నేత, చింతల శంకర్, రాజయ్య, శ్రావణ్ కుమార్ గౌడ్, జిల్లా సోషల్ మీడియా ఇన్చార్జి రాజేందర్, సదాశివ నగర్ మండల్ ఇన్చార్జి రాజు, కామారెడ్డి పట్టణ నాయకులు అల్వాల గోపాల్, పెంటయ్య, పిట్లం బుబు మేస్త్రీ, మహబూబ్, తదితరులు పాల్గొన్నారు.

నూతన బూత్ కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని బూతు నెంబర్ 104, 105లో నూతన బూత్ కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. 104 బూత్ అధ్యక్షులుగా రాజేందర్‌ను, 105వ బూత్ అధ్యక్షులుగా కిషన్‌రావు నియమితులైన సందర్భంగా వారికి మండలాధ్యక్షులు కుంట రాంరెడ్డి, మండల ఉపాధ్యక్షులు బాల్ కిషన్ శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ బిజెపి పూర్వ నాయకులు, కార్యకర్తలు, శక్తి కేంద్ర నిర్వాహకులు పాల్గొన్నారు.

నూతన సంవత్సరానికి ఘన స్వాగతం

- జిల్లా వ్యాప్తంగా సంబరాలు
- కేక్‌ల అమ్మకానికి ప్రత్యేక కౌంటర్లు
- పోలీసుల పటిష్ట బందోబస్తు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

2024 వీడ్కోలు పలుకుతూ 2025కు స్వాగతం పలికే విధంగా జిల్లా ప్రజలు ఏర్పాట్లు చేసుకున్నారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాల్లో కూడా నూతన సంవత్సర సందడి కనిపించింది. జీవితంలో ఒక సంవత్సరం పూర్తై మరో సంవత్సరంలోకి అడిగి పెట్టడంతో పాటు ఎన్నో కోరికలు నెరవేరాలని భావిస్తూ ప్రజలు పెద్ద ఎత్తున సంబరాలు నిర్వహించుకున్నారు. ఎక్కడికక్కడ కార్యక్రమాలు ఏర్పాటు చేసుకొని నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు.

జిల్లా వ్యాప్తంగా సంబరాలు



నూతన సంవత్సర వేడుకలు జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలో పలు కాలనీలో ఆయా కాలనీవాసులు ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేసుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఇదే కనిపించింది. జిల్లాలో వేడుకలు ఆద్యంత అంబరాన్నంటేలా సాగాయి. చిన్న పెద్ద తేడా లేకుండా నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొని ఉత్సహంగా స్వాగతం పలికారు.

కేక్‌ల అమ్మకానికి ప్రత్యేక కౌంటర్లు

సాధారణ రోజుల్లో వాలే కాకుండా నూతన సంవత్సర ప్రత్యక్ష కేకుల తయారీకి వ్యాపారస్తులు ప్రాధాన్యత ఇచ్చారు. వీటి అమ్మకానికి కూడా జిల్లా కేంద్రంలో ప్రత్యేక కౌంటర్లు వినియోగదారులను ఆకర్షించేలా ఏర్పాటు చేశారు. టెంట్ వేసి ఉదయం నుండి కేకుల ధరలు తెలిసేలా కౌంటర్ వద్ద మైకుల ద్వారా ప్రచారం నిర్వహించారు. ప్రజలు కేకులు కొనుగోళు చేసేందుకు బారులు తీరారు.

పోలీసుల పటిష్ఠ బందోబస్తు

నూతన సంవత్సర నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. రెండు రోజులుగా ప్రజలకు సామాజిక మాధ్యమాలతో పాటు వివిధ మాధ్యమాల ద్వారా వేడుకలకు సంబంధించి సూచనలు చేస్తున్న పోలీసులు దానిని పక్కగా అమలు చేశారు. ఎక్కడికి అక్కడ పెట్రోలింగ్ నిర్వహించడంతో పాటు ప్రత్యేకంగా సిబ్బందిని నియమించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేశారు. ఏది ఏమైనా వేడుకలకు ప్రత్యేక బందోబస్తు కనిపించింది.

ప్రభుత్వ కార్యాలయాలు దూరం

మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ మరణించడంతో సంతాప దినాలు ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం వేడుకలు కూడా నిర్వహించకూడదని సూచించింది. దీంతో అనేక ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు వేడుకలకు దూరంగా ఉన్నాయి. కొన్ని ప్రయివేటు విద్యాసంస్థల్లో విద్యార్థులు సొంతగా వేడుకలు నిర్వహించుకున్నారు.





అక్కడ రాగి జావకు భలే గిరాకీ..



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

కాలం మారుతోంది. మారుతున్న కాలంతో పాటు వ్యక్తుల అలవాట్లు, అభిరుచులు మారుతున్నాయి. ముఖ్యంగా ఆహారపు అలవాట్లలోనూ పెను మార్పులు చోటు చేసుకుంటున్నాయని చెప్పవచ్చు. ప్రతి ఒక్కరిది ఉరుకులు పరుగుల జీవితం అయిపోవడంతో మంచి ఆహారం వండుకుని తినే సమయం కూడా దొరకడం లేదు. దీంతో రెడిమేడ్ ఫుడ్, ప్యాక్డ్ ఫుడ్‌కు అలవాటు పడిపోతున్నారు. అయితే ఆధునిక ఆహారపు అలవాట్లు ఆరోగ్యంపై ప్రభావం చూపుతుండటం ప్రస్తుతం అందరి చూపు పాత తరానికి చెందిన ఆహారపు అలవాట్లపై పడింది. వృత్తి, ఉద్యోగ బాధ్యతలతో క్షణం తీరిక లేకుండా పనిచేస్తున్న వారు ఒత్తిడి నుండి ఉపశమనం కోసం వ్యాయామాలు, యోగ, ధ్యానం వంటివి చేస్తున్నారు. వ్యాయామంతో ఆహారానికి ప్రాధాన్యమిస్తున్నారు. తమ ఆహారపు అలవాట్లను కూడా మార్చుకుంటున్నారు. చిరుధాన్యాలు, మొలకలు, రాగి జావ వంటివి తమ మెనులో చేర్చుకుంటున్నారు. క్రమం తప్పకుండా వీటిని తీసుకుంటున్నారు.

పెరిగిన డిమాండ్

ఇదిలా ఉంటే ప్రస్తుతం పాతకాలపు ఆహార పదార్థాలకు మళ్లీ డిమాండ్ పెరిగింది. మారిన అభిరుచులకు మేరకు రెడిమేడ్‌గా పాతకాలపు ఆహార పదార్థాలను విక్రయించే దుకాణాలు కూడా వెలిశాయి. ఆదిలాబాద్ పట్టణంలోని ఇందియా ప్రియదర్శిని స్టేడియంతో పాటు పట్టణంలో పలు ముఖ్య కూడల్లో ప్రత్యేకంగా దుకాణాలు వెలిశాయి. రాగిజావ, మెలకలు, చిరుధాన్యాలు, కూరగాయలతో తయారు చేసిన జ్యూస్ లను విక్రయిస్తున్నారు. నిత్యం ఉదయం రాగి జావ తాగడం అలవాటు చేసుకున్నారు. ప్రస్తుతం ప్రజలు తీసుకుంటున్న ఆహారంలో రాగి జావకు ప్రాధాన్యతనిస్తుండటంతో దీనికి బాగా గిరికా పెరిగింది. ఉదయం స్టేడియంలో వాంకింగ్ పూర్తి కాగానే ఇంటి వెళ్ళే సమయంలో రాగి జావ తాగి వెళుతున్నారు. ఈ రాగి జావ ఒక్కో గ్లాస్ రూ.15 ధర పలుకుతుంది. ఉదయం, సాయంత్రం వేళల్లో ఈ రాగి జావ దుకాణాలు స్టేడియం వద్ద అందుబాటులో ఉంటాయి. ఒక్కోరోజు 150 నుండి 200 గ్లాసుల రాగి జావ అమ్ముడుపోతోందని దుకాణదారులు చెబుతున్నారు. ఆదిలాబాద్ పట్టణంలో ఈ రాగి జావను విక్రయించే దుకాణాలు కనీసం 15 ఉన్నాయంటే దీనికి ఎంత డిమాండ్ ఉందో ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. ఏదిఏమైనప్పటికి వేపుళ్ళ, నూనె పదార్థాల వంటి ఆధునిక ఆహారపు అలవాట్ల నుండి రాగి జావ వంటి పాత తరానికి ఆహార పదార్థాల వైపు మొగ్గుచూపుతుండటం విశేషంగా చెప్పవచ్చు.





నిరాధార ఆరోపణలకు పాల్పడితే కఠిన చర్యలు



నవతెలంగాణ-జైపూర్

ఇతరుల మనోభావాలు దెబ్బ తినేవిధంగా సోషల్ మీడియా వేదికగా వ్యక్తిగతంగా నిరాధారమైన నిందారోపనలకు పాల్పడిన వారి పట్ల చట్టపరంగా కఠినంగా వ్యవహరించాల్సి వస్తుందని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి పీఏ రమణారావు విషయంలో ఇటీవల సోషల్ మీడియా వేదికగా నిందార ఆరోపనలు చేసిన తీరును ఉదహరిస్తూ మంగళవారం స్థానిక ఎస్ఐ శ్రీధర్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎల్కంటి గ్రామానికి చెందిన బేతు తిరుపతిరెడ్డి ఎమ్మెల్యే పీఏ రమణారావు పేరుతో వ్యక్తిగత నిందారోపనలకు పాల్పడినటం, సోషల్ మీడియా, వాట్సాప్ గ్రూపుల ద్వార ప్రచారం చేసినట్లు తెలిపారు. సోషల్ మీడియా వేదికను దుర్వినియోగం చేస్తూ వాట్సాప్ గ్రూపుల్లో నిరాధార నిందారోపనలు ప్రచారం చేసినా ప్రచురించినా చట్టపరంగా నేరస్థులవుతారని హెచ్చరించారు. కాగా ఎమ్మెల్యే పీఏ రమణరావు విషయంలో నిరాధార నిందారోపనలు చేసిన తిరుపతిరెడ్డిపై ఐటీ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిందితుడు తిరుపతి రెడ్డి పరారీలో ఉన్నందున వీలైనంత త్వరగా అరెస్ట్ చేయడం జరుగుతుందని తెలిపారు.

ఉద్యోగ, ఉపాధ్యాయుల పీఆర్సీని ప్రకటించాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఉద్యోగ, ఉపాధ్యాయుల పీఆర్సీని వెంటనే ప్రకటించాలని పీఆర్టీయూ టీఎస్ ఏటుకూరి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం చింతగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఈజ్‌గాం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గణపురం సంపత్, కిషన్ పదడాలి ఉద్యోగ విరమణ చేసిన సందర్భంగా కార్యక్రమాలలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయులకు 50శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీని ప్రకటించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులన్నీ విడుదల చేయాలని జనరల్ ప్రావిడెంట్ ఫండ్‌లో పెండింగ్‌లో ఉన్న రుణాలను పాక్షిక ఉపసహరణలు వెంటనే విడుదల చేయాలని కోరారు. సమగ్ర శిక్ష, ఐటీడీఏలో పనిచేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించి వారికి సర్వీస్ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఇందార ప్రకాష్, జాడి దేవాది, భువనగిరి శశాంక్, బడుగు శ్రీనివాస్, ఎనగంటి బిక్షపతి, తిరుపతి, గుల్లపల్లి రవిశంకర్, వాసాల ప్రభాకర్ పాల్గొన్నారు.

కందకుర్తి పాఠశాల సందర్శన

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కందకుర్తి పాఠశాలను మంగళవారం తహసిల్దార్ శ్రావణ్ కుమార్ సందర్శించారు. మహారాష్ట్ర సరిహద్దులోనున్న కందకుర్తి జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యాబోధనలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక శిక్షణను ఇవ్వాలని తహసీల్దార్ శ్రావణ్ కుమార్ ప్రధానోపాధ్యాయులు అబ్దుల్ కరీంకు సూచించారు. సబ్ కలెక్టర్ ఆదేశాల మేరకు వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులను నిర్వహించి విద్య బోధనలో మార్పులు తీసుకురావాలని ఆయన ఉపాధ్యాయులను ఆదేశించారు. మూడు విడతలుగా విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వగా మొదటి పూర్తయిందని, రెండవ విడతలో నిర్వహించే పరీక్షల సమయంలో తనకు సమాచారం ఇవ్వాలని ప్రధానోపాధ్యాయుడికి సూచించారు. ఉపాధ్యాయుల కొరత ఉన్నప్పటికీ విద్యార్థులలో సృజనాత్మక శక్తిని బయటకు తీసేలా ఉపాధ్యాయులు బోధించాలని ఆయన అన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ, అంకితభావంతో విద్యార్థులను తీర్చిదిద్దాలని ఆయన పేర్కొన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు.

న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలి

నవతెలంగాణ-కామారెడ్డి

సమగ్ర శిక్ష ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని ట్రస్మా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ ఉప్పునూతల నాగరాజు గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం సమగ్ర శిక్ష ఉద్యోగుల దీక్ష శిబిరాన్ని సందర్శించి వారికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులు గత 22 రోజులుగా ఇంటిని, పిల్లలను వదిలి జిల్లా కేంద్రంలో తమ సమస్యలను పరిష్కరించాలని నిరవధిక సమ్మె చేస్తుంటే ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందన్నారు. కార్యక్రమంలో ట్రస్మా జిల్లా అధ్యక్షులు శరత్‌చంద్ర, జిల్లా కోశాధికారి నిస్సి సాంసన్, రాష్ట్ర నాయకులు శివరాత్రి యాదగిరి, ఆనందరావు, జిల్లా నాయకులు శ్రీనివాస్ రాజారాం, రాజు, చంద్రశేఖర్, భాస్కర్, రమేష్, సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి సంపత్, మహిళా అధ్యక్షురాలు వాసంతి, నాయకులు శ్రీధర్ రాములు, శైలజ, సంతోష్‌రెడ్డి, కాళిదాసు, వనజ, మంగా, శ్రీవాణి, కళ్యాణ్, సంధ్య, లింగం, కృష్ణ, దినేష్, వీణ, లావణ్య 500 మంది సభ్యులు పాల్గొన్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగస్తుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని భారతీయ విద్యార్థి మోర్చా రాష్ట్ర కార్యదర్శి జీవీఎం విట్టల్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ విద్యార్థి మోర్చా ఆధ్వర్యంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరవధిక సమ్మెకు మద్దతు తెలుపుతున్నామన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర శిక్ష ఉద్యోగస్తులు గత కొన్ని రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు శ్రావణ్, అజయ్, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణకు గురైన స్థలం స్వాధీనం

నవతెలంగాణ-లింగంపేట్

గ్రామపంచాయతీ స్థలం ఆక్రమణకు గురవడంతో గ్రామస్తులు సోమవారం రాస్తారోకో చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆ స్థలాన్ని మంగళవారం ఎల్లారెడ్డి ఆర్డీవో ప్రభాకర్, ఎమ్మార్వో నరేందర్, ఎంపీడీవో నరేష్ అధికారుల బృందం సందర్శించారు. అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న స్థలాన్ని సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాలని ఆర్డీవో ప్రభాకర్ ఎమ్మార్వో నరేందర్‌కు సూచించడంతో సర్వేయర్ కిరణ్ సమక్షంలో సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేశారు. చుట్టూ హద్దులు పాతి కంచె ఏర్పాటు చేయాలని ఆర్డీవో ఆదేశించడంతో చుట్టూ రేకుల కంచెను ఏర్పాటు చేశారు. స్థలాన్ని గ్రామపంచాయతీ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు.

పిఆర్‌టియు క్యాలెండర్ల ఆవిష్కరణ

నవతెలంగాణ-రెంజల్

రెంజల్ పిఆర్‌టియు క్యాలెండర్‌ను తహసిల్దార్ శ్రావణ్ కుమార్, ఎంపీడీవో వెంకటేష్‌యాదవ్, సూపరింటెండెంట్ శ్రీనివాస్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి కట్ట ఆంజనేయులు, పీఆర్టీయూ మండలాధ్యక్ష కార్యదర్శులు టి.సోమలింగం గౌడ్, వై.కిషోర్ కుమార్, గౌరవ అధ్యక్షులు ఈ.శంకర్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు నరసింహారెడ్డి, కృష్ణ, నాందేవ్, శంకర్, మండల అసోసియేట్ అధ్యక్షులు రఫీక్ హుల్ అజీమ్ తాహిర్, మండల కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, మండల ప్రాథమిక సభ్యులు వినోద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పౌర హక్కులపై అవగాహన ఉండాలి

నవతెలంగాణ-దోమకొండ

సమాజంలో కుల మతం బేధం లేకుండా ప్రతి ఒక్కరూ కలిసిమెలిసి ఉండాలని ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని సీతారాంపుర్ గ్రామంలో పౌరహక్కుల దినోత్సవంపై గ్రామస్తులకు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. పౌర హక్కుల చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, ఎస్సి, ఎస్టీలను కులం పేరు ఎవరైనా దూషిస్తే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని గ్రామస్తులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రేఖ, వార్డెన్ సరిత, అధికారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.